
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 16 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	200	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 18.4

సంక్రాంతి బరం



పతంగులతో చిన్నారుల సందడి



సంక్రాంతి పండుగంటే ఊరంతా సందడే ఉంటుంది. గ్రామాల్లో ఇంటికి చేరిన పంట ఉత్పత్తులతో రైతులు ఆనందంగా ఉండగా, కొలువుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కుమారులు, కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో ప్రతీ ఇంట సందడి వాతావరణం ఉంటుంది. పండుగకు ప్రత్యేక పూజలు, ఇంటిముంగిట గొబ్బెమ్మలతో రంగురంగుల రంగవల్లులు, పిండి వంటలు, మాంసం రుచులు, పతంగులతో చిన్నారుల సంబరాలు, సాయంత్రం వేళ మద్యం ప్రియుల సందడి ఉంటుంది. పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లా వాసులు భారీగా వ్యయం చేయగా, ప్రభుత్వ ఖజానాకు కాసులు కురిశాయి. మొత్తంగా రూ.118.46కోట్లను ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ పండుగకు ఖర్చుచేసినట్టు అంచనా.
(ఆంధ్రజ్యోతి,కోదాడ)

» ఊరూవాడ వేడుకలు » పండుగ ఖర్చు రూ.118.46కోట్లు » భారీగా వ్యయం చేసిన ఉమ్మడి జిల్లా వాసులు

» మద్యంపై రూ.40.17కోట్లు » ఆర్టీసీకి అదనంగా రూ.85లక్షల ఆదాయం » ఆరు రోజుల్లో నృసింహుడి ఆదాయం రూ.2.20కోట్లు

మద్యంపై భారీగా ఆదాయం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 299 వైన్స్ షాపులు ఉన్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 11, 13న నల్లగొండ, యాదాద్రి మద్యం డిపో పరిధిలో భారీగా విక్రయాలు జరిగాయి. రెండు రోజుల్లో రెండు డిపోల పరిధిలో 59,086 కాటన్ల బీర్లు, 42,137 కాటన్ల మద్యం మొత్తంగా 1,01,223 కాటన్ల విక్రయాలు జరిగాయి. కాగా, వీటి విక్రయాల ద్వారా రూ.40.17కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది. అంతేకాక ఈ నెల 14న, 15న వచ్చిన ఆదాయం దీనికి అదనం.



ఆర్టీసీకి రూ.8.05కోట్ల ఆదాయం



ప్రయాణికుల రద్దీ

ఉమ్మడి జిల్లా రీజియన్ పరిధిలో ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, దేవరకొండ, భువనగిరి, యాదగిరిగుట్టలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. సంక్రాంతి నేపథ్యంలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు ఆయా డిపోల పరిధిలో ఆర్టీసీ 415 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. ఈ బస్సులు 1,23,227కి.మీలు తిరిగి 1,22,500మంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చాయి. వారిలో మహాలక్ష్మి పథకం కింద 78,500మంది మహిళా ప్రయాణికులు ఉండగా, 44వేల మంది చార్జీలు చెల్లించి ప్రయాణించారు. ఏడు డిపోల పరిధిలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు మొత్తంగా 620 బస్సులు నడిచాయి. ఆయా బస్సులు 13.28లక్షల కి.మీలు తిరిగి, 13.55లక్షల మంది ప్రయాణికులను గమ్యానికి చేర్చాయి. మహాలక్ష్మి పథకం కింద 8లక్షల మంది మహిళలు ప్రయాణించగా, 5.55లక్షల మంది చార్జీలు చెల్లించి ప్రయాణించారు. ఆర్టీసీకి ఐదు రోజుల్లో మొత్తంగా రూ.8.05కోట్ల ఆదాయం రాగా, పండుగ సందర్భంగా రూ.85లక్షల అదపు ఆదాయం వచ్చింది. మొత్తంగా...

మిగతా 7వ పేజీలో...

పిండి వంటకాలపై రూ.1.44కోట్లు

సంక్రాంతి అంటే పిండి వంటలకు అందులో అరిసెలకు ప్రత్యేకత స్థానం ఉంటుంది. పిండి వంటలను ఇష్టపడనివారంటూ ఉండదు. ప్రస్తుతం పని ఒత్తిడితో పిండి వంటలకు అంతా స్వీట్స్ దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 144 స్వీట్స్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో అరిసెలపై రూ.1లక్ష, మొత్తంగా రూ.1.44 కోట్లు ఖర్చు చేశారు. బేకరి, ముగ్గుల కోసం ఉమ్మడి జిల్లా ప్రజలు సుమారు రూ.2కోట్ల మేర ఖర్చు చేసినట్లు సమాచారం.



యాదగిరిక్షేత్రం జన సంద్రం

భువనగిరి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వరుస ఉత్సవాలు, సంక్రాంతి పర్వదినానికి తోడు వరుస సెలవులు కలిసి రావడంతో ఆధ్యాత్మిక శోభతో క్షేత్రం జనసంద్రంగా మారింది. గత డిసెంబరు 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు, ఈ నెల 10 నుంచి 15 వరకు అధ్యయనోత్సవాలు కొనసాగగా, సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో వేకువజామున జరిగిన తిరుప్పావై ఉత్సవాల్లో మహిళలు, ఆరు రోజుల పాటు సాగిన అధ్యయనోత్సవాలు, స్వామివారి అలంకరణ తిరువీధి సేవలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 13న భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుమ మూడు రోజులు సంక్రాంతి సందర్భంగా భక్తుల రాక పెరిగింది. కొండపైన శివకేశవులు, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకాంప్లెక్స్, క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయ, ప్రాకార మండపాలు, తిరువీధులు, ప్రసాద విక్రయశాలలు, బస్టాండ్ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. కాగా, ఆరు రోజుల్లో రూ.2,20,47,604 ఆదాయం సమకూరింది. అధ్యయనోత్సవాలు....

మిగతా 7వ పేజీలో...

ఆరు రోజుల్లో గుట్ట ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు, ఆదాయం ఇలా..

తేదీ	భక్తుల సంఖ్య	నిత్య ఆదాయం
10	15,000	రూ.17,65,927
11	28,000	రూ.30,24,196
12	49,000	రూ.50,74,808
13	42,000	రూ.43,46,558
14	46,000	రూ.47,36,325
15	29,000	రూ.30,99,790
మొత్తం	2,09,000	రూ.2,20,47,604

పండుగపూట విషాదాలు

- రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి
- నల్లగొండ జిల్లాలో నలుగురు, యాదాద్రి జిల్లాలో ఇద్దరు మృతి

6లో..

పథకాలను పకడ్బందీగా

అమలు చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామసభల నిర్వహణ, అర్హుల జాబితా ఆమోదం తదితర కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పథకాల అమలుకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రైతు భరోసా'కు సంబంధించి భూభారతి పోర్టల్ నుంచి హార్డ్ కాపీలు అందుబాటులో ఉన్నాయని, మండల వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని ఈనెల 16 నుంచి 20 వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను కేటగిరీ వారిగా నమోదు చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహించి వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు చదివి వినిపించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఈనెల 25న జిల్లా ఇన్‌చార్జి మంత్రితో అర్హుల జాబితా ఆమోదం తీసుకుని, ఈనెల 26 నుంచి పథకాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కింద 2023-24లో ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 రోజులు పని చేసిన వారి జాబితా రాష్ట్రస్థాయి నుంచి గ్రామసభల నిర్వహణలోపు వస్తుందని, ఆ జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించి ఏమైనా అభ్యంతరాలుంటే 10 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

నూతన రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను గ్రామసభల్లో చదివి వినిపించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఈనెల 26న కనీసం 10శాతం నూతన రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సర్వేలో అర్హత పొందిన వారి ఆన్‌లైన్ డేటాను రెండు రోజుల్లో సూపర్ చెక్ పూర్తి చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో ప్రాధాన్య క్రమంలో లబ్ధిదారుల జాబితాను ఆమోదించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ శ్రావణ్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తేలనున్న భూముల లెక్కలు



» నేటి నుంచి 20వ తేదీ వరకు క్షేత్ర స్థాయి పరిశీలన

» వ్యవసాయ యోగ్యం కాని భూములను తేల్చే పనిలో యంత్రాంగం

సాగు భూముల లెక్కలను తేల్చేందుకు వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాలు, క్లస్టర్ల వారీగా ప్రతి సర్వే నెంబర్‌ను చూడటంతో పాటు వ్యవసాయ యోగ్యం కాని భూముల లెక్క తేల్చనున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

రైతుభరోసాకు సంబంధించి భూ భారతి పోర్టల్ నుంచి పట్టదారు పాస్‌పుస్తకాలు ఉన్న రైతుల వివరాల హార్డ్ కాపీలు మండల వ్యవసాయ అధికారులకు ప్రభుత్వం అందజేసింది. దీంతో మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ బుధవారం ఈ డేటాను డౌన్‌లోడ్ చేసుకొని ఐదు రోజుల పాటు గ్రామాల్లో సర్వే చేపట్టనున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వ్యవసాయ విస్తరణాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, లేదంటే ఒక రెవెన్యూ అధికారి పాల్గొంటారు. వారు గ్రామాల్లో పర్యటించి వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు నమోదుచేస్తారు. సాగులో ఉన్న భూమి కోసం ప్రభుత్వం ఏటా రూ.12వేలను పెట్టుబడి సాయంగా అందజేయనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.7500 చొప్పున మొత్తం రూ.15వేలు జమ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నేపథ్యంలో ప్రభుత్వం రూ.12వేలు అందజేయనుంది. ఉమ్మడి జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

సాగుకు యోగ్యం కాకుంటే

'భరోసా' లేనట్లే..

రాళ్ల, రప్పలు, గుట్టలు, ఇండ్లు, ప్లాట్లతో పాటు సాగుకు అనుకూలంగా లేని భూములకు ప్రభుత్వం రైతు భరోసాను నిలిపివేయనుంది. కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించనుంది. గత ప్రభుత్వం హయాంలో ఎకరాకు రూ.5వేలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.6వేలు అంటే రెండు సీజన్లకు కలిపి రూ.12వేలను పెట్టుబడి సాయంగా ఇవ్వనుంది. సాగుకు యోగ్యంగా లేని భూముల వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అధికారులు నమోదు చేసి 25వ తేదీ నాటికి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తారు. 16 నుంచి 20వ తేదీ వరకు సర్వే చేసిన అనంతరం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామపంచాయతీల వారీగా గ్రామ సభలు నిర్వహిస్తారు. ఆయా గ్రామ సభలో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలుచదివి వినిపించి ఆమోదం తీసుకుంటారు. నల్లగొండ జిల్లాలో 566 రెవెన్యూ గ్రామాలు, సూర్యాపేట జిల్లాలో 279, యాదాద్రి జిల్లాలో 321 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి ఐదు రోజుల్లో ప్రతీ సర్వేనెంబర్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. వ్యవసాయ యోగ్యం కాని భూములను తేల్చే పనిలో యంత్రాంగం

మిగతా 7వ పేజీలో...

అంకితభావంతో పనిచేయాలి



ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, పదోన్నతి పొందిన వారు అంకితభావంతో పని చేసి శాఖ గౌరవాన్ని, విశ్వాసాన్ని పెంచేలా పని చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం పరిధిలో పని చేస్తున్న 11 మంది ఏఎస్‌ఐలు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన నేపథ్యంలో బుధవారి వారికి తన క్యాంపు కార్యాలయంలో స్టార్‌లను అందజేసి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలతో మమేకమవుతూ బాధ్యతతో పని చేస్తూ మన్ననలు పొందాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని న్యాయం చేయాలన్నారు. బాధితులకు న్యాయం చేసినప్పుడే పోలీస్‌శాఖకు గౌరవం వస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజు, పదోన్నతి పొందిన ఎస్‌ఐలు భిక్షమయ్య, అవుట జయరాజు, ఐ.శ్రీనువాసులు, ఎండీ.గౌస్, ఎండీ.అహ్మద్‌షరీఫ్, ఎం.దుర్గారెడ్డి, డి.నర్సిరెడ్డి, ఎస్.కృష్ణ, జి.కృష్ణారెడ్డి, మహబూబ్‌అలీ, జహంగీర్ పాల్గొన్నారు.

వైటీపీఎస్ జాబ్‌కార్డుదారులకు

నేడు చివరి గడువు

» ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి » సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్



విలేకరులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ జాబ్‌కార్డులు పొందిన నిర్వాసితులు ఈ నెల 16 సాయంత్రంలోగా సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని సబ్‌కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైటీపీఎస్‌లో ఇళ్లు కోల్పోయిన 133 కుటుంబాల్లో అర్హులైన 116 మంది జాబితాను టీఎస్ జెన్కోకో బోర్డుకు పంపామన్నారు. మరో 16 కుటుంబాల్లో వారసులు లేనందున మనుమలు, బంధువుల పేరున ఉద్యోగం ఇచ్చేందుకు కమిటీకి నివేదించామన్నారు. మరొకరు ఉద్యోగానికి బదులు నగదు తీసుకునేందుకు ఒప్పుకున్నారని తెలిపారు. 525 నిర్వాసిత కుటుంబాల జాబితాను రూపొందించేందుకు గత మూడు వారాలు సర్వే నిర్వహించామని తెలిపారు. వారిలో 400 కుటుంబాలు స్పందించగా, మరో 125 కుటుంబాల నుంచి స్పందన కరువైందన్నారు. 400 కుటుంబాల్లో 220 మంది వరకు అవార్డు డ్యాకుమెంట్లతో వచ్చి వివరాలు అందజేశారని, 80 కుటుంబాల వారికి వారసులు లేనందున అల్లుడు, మనుమలు తదితరుల పేర్లు ఇచ్చారన్నారు. వీరి జాబితాను ప్రత్యేక బోర్డుకు పంపుతామన్నారు. మిగతా వారు ఈ నెల 16 సాయంత్రంలోగా వివరాలు అందజేయాలన్నారు. అర్హుల జాబితాను రూపొందించి జెన్కోకో బోర్డుకు పంపుతామన్నారు. ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నట్టు తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఇళ్లకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లి పరిశీలన నిర్వహిస్తారని చెప్పారు. 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కేటగిరీల వారిగా గ్రామసభల ద్వారా జాబితా రూపొందించనున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో తొలుత భూమిలేని నిరుపేద ఉపాధిహామీ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు అందజేయనున్నట్టు తెలిపారు. 2023-24 సంవత్సరంలో జాబ్‌కార్డులు ఉన్న వారు కనీసం 20రోజుల పాటు పనిదినాలు నమోదై ఉండాలని చెప్పారు. గ్రామసభల్లో వీరిని గుర్తిస్తామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



నల్లగొండ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఈ నెల 25 నుంచి 28 తేదీ వరకు సంగారెడ్డిలో జరగనున్న పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్లను స్థానిక పార్టీ కార్యలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ నెల 25న సంగారెడ్డి పట్టణంలో ప్రజా ప్రదర్శన, పీఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజ సమస్యలపై వారి పక్షాన నిలబడి పోరాడుతున్నది సీపీఎం ఒక్కటేనన్నారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం గడిచినా నేటికీ ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచడం లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలోని ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. నిరుద్యోగ యువత కొలువుల కోసం ఎదురు చూస్తున్నారని, కూలీలు, కార్మికుల బతుకులు దయనీయంగా ఉన్నాయన్నారు. బీఆర్‌ఎస్ పాలనకు విసిగిన ప్రజలు ఆశతో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాదిగా వాగ్దానాలు తప్ప అమలుకు నోచుకోలేదన్నారు. సీపీఎం పోరాటాల ఫలితంగానే డిండి ఎత్తిపోతల పనులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో క్రమంగా అసంతృప్తి పెరుగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటి, రెండు తప్ప మిగతావి అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, వి.వెంకటేశ్వర్లు, గంజి మురళి, దండెంపల్లి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలపై చర్చించేందుకే

జనరల్‌బాడీ సమావేశం

● గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

పదేళ్లుగా మదర్ డెయిరీ సంస్థ లోబడ్జెట్‌తోనే నడుస్తోంది. ఇటీవల నెలకు రూ.కోటి నష్టం వరకూ వస్తోంది. అందుకు మార్కెట్‌లో విక్రయాలు లేకపోవడం కారణం. కొన్నేళ్లుగా నష్టాలు వస్తున్నా, గత పాలకవర్గాలు లాభాలు వస్తున్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చారు. నష్టాన్ని కూడా మూడు నెలల్లో కొంత రికవరీ చేశాం. గతంలో ఆస్తుల విక్రయాలపై తీర్మానం చేశారు. వాటిపై చర్చించేందుకే ఫిబ్రవరి 7న జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశామంటున్న మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డితో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ....

ఆంధ్రజ్యోతి: మదర్ డెయిరీ ఆస్తులు విక్రయానికి పెట్టినట్లు ప్రచారం జరుగోతోంది.

చైర్మన్ : ప్రస్తుతం మదర్ డెయిరీ సంస్థ సుమారు రూ.60వేల కోట్ల ఆర్థిక భారంతో నడుస్తోంది. గత పాలకవర్గాలు డెయిరీ ఆస్తులను మార్టిగేట్ చేసి బ్యాంక్ ద్వారా సుమారు రూ.28కోట్లు అప్పు తీసుకున్నారు. అందుకు నెలకు రూ.40లక్షలు వడ్డీ చెల్లిస్తున్నారు. గత సెప్టెంబరు 2024లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో డెయిరీ రూ. 36లక్షలు నష్టాల్లో ఉన్నట్లు ఆడిట్ రిపోర్ట్‌లో చూపించారు. డెయిరీ సంస్థ మ్యాక్స్ చట్ట కింద స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ. కాబట్టి సంస్థకు లాభాలు వచ్చినా, నష్టాలు వచ్చినా సంస్థనే చూసుకోవాలి. ప్రభుత్వం ఎలాంటి సహకారం చేయడానికి సిద్ధంగా లేదు. గతంలో బోర్డు మీటింగ్‌లో పాలకవర్గం సంస్థను నష్టాల ఊబి నుంచి బయటపడేసేందుకు డెయిరీ ఆస్తులను విక్రయించి నష్టాన్ని పూరించే విధంగా తీర్మానం చేసింది. గతంలో చేసిన తీర్మాణంపై చర్చించేందుకు ఫిబ్రవరి 7న జనరల్ బాడీ మీటింగ్‌ను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: తమ కష్టనష్టాలను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు ?

చైర్మన్ : మదర్ డెయిరీ కొన్నేళ్లుగా నష్టాలతో నడుస్తోంది. రోజుకు రైతుల నుంచి లక్ష లీటర్ల పాలను సేకరిస్తుండగా ఇందులో 60వేల లీటర్ల పాలు మాత్రమే విక్రయిస్తున్నాం. మిగితా పాలను వివిధ పాలఉత్పత్తులతో పాటు పాల పౌడర్‌ను తయారు చేయడం వల్ల లీటరుకు రూ.7 నష్టం వస్తుంది. ఈ నష్టాన్ని మూడు నెలల్లో కొంత రికవరీ చేసినప్పటికీ నెలకు రూ.60-70లక్షల వరకు నష్టం వస్తుంది. అంతే కాకుండా రైతుల పాల సేకరణకు సంబంధించి ఇప్పటివరకు రూ.20 కోట్లు బకాయి బిల్లులు రైతులకు చెల్లించాల్సి ఉంది. సంస్థ నష్టాల్లో ఉండడంతో రైతులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. పాల సేకరణ ధరను కూడా పెంచలేక పోతున్నాం.

ఆంధ్రజ్యోతి : మదర్ డెయిరీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి ఏమిటి?

చైర్మన్ : మదర్ డెయిరీ ప్రస్తుతం నష్టాల్లో ఉంది. ప్రస్తుతం నెలకు రూ.1.75 కోట్లు ఉద్యోగులకు జీతాలు, 30 ఏళ్ల కిందట ఏర్పాటుచేసిన ప్లాంట్ కావడంతో నిర్వహణ ఖర్చులు రూ.కోటితో పాటు ఇతరత్రా ఖర్చులు రూ.3 కోట్ల వరకూ ఉన్నాయి. డెయిరీ నష్టాల్లో ఉన్నా గత పాలకవర్గం దాదాపు 235 మంది కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు 180మంది ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చారు. దీంతో సంస్థకు అదనంగా నెలకు రూ.15 నుంచి రూ.20లక్షల వరకు అదనపు భారం పడుతోంది. పాలసేకరణకు సంబంధించి రైతులకు ఇప్పటివరకు రూ.20 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి : డెయిరీ అభివృద్ధికి ఏం చేస్తున్నారు?

చైర్మన్ : మదర్ డెయిరీ అప్పులు తీరిస్తే వడ్డీల భారంపోతుంది. అప్పుడు రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు సకాలంలో చెల్లించవచ్చు. సంస్థను మళ్లీ లాభాల్లోకి తీసుకురావడానికి దృష్టి సారించవచ్చు. సొసైటీ అధ్యక్షులతో చర్చించి గతంలో చేసిన వంటి తీర్మానంపై ఏకాభిప్రాయంతో చర్చించేందుకు ఫిబ్రవరి 7న జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశాం.

సంతా.. మా ఊరి సంతా



రవాణా సౌకర్యం, వస్తు వినియోగం ఎక్కువగా లేని రోజుల్లో సంతలే గ్రామీణ ప్రాంత వాసులకు మార్కెట్లు. సంతలకు పల్లెల్లో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. వారానికి సరిపడా ఉప్పు, పప్పు, బట్టలు, కూరగాయలు, నిత్యావసరాలు, ఇతర సామాగ్రిని సంతల్లోనే కొనితెచ్చుకుంటుంటారు. అలాంటి సంతలకు నేటికీ ప్రాధా న్యం ఏమాత్రం తగ్గలేదు. సంత జరిగే రోజు కోసం వేచిచూసే తీరున సంతతో అనుబంధం ఉంటుంది. యాదాద్రి భువనగిరి రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించే సంత కూడా ఆ కోవకు చెందిందే. రాజాపేట సంత ఈ ఏడాదితో 75 వసంతాలు పూర్తి చేసుకుంది. 1950లో ప్రారంభమైన సంతకు నేటికీ కొనసాగుతున్న వైనంపై ప్రత్యేక కథనం.

- (ఆంధ్రజ్యోతి-రాజాపేట)

▸ రాజాపేట సంతకు 75 ఏళ్లు

▸ ఊరూరా సంతలతో తగ్గుతున్న పూర్వవైభవం

రాజాపేట మండలకేంద్రంలో ప్రతీ గురువారం సంత జరుగుతుంది. ఈ సంత 75 ఏళ్ల నుంచి నిరంతరాయంగా కొనసాగుతోంది. చుట్టుముట్టు గ్రామాల ప్రజలు సరుకులను ఈ సంత రోజు రాజాపేటకు వస్తుంటారు. ఈ సంత చుట్టుపక్కల ప్రాంతాల్లోనే అతిపెద్దది. 1950లో మొదటిసారి సంత ఏర్పాటు కోసం గ్రామస్థులు సమావేశం నిర్వహించారు. మొదట మండలకేంద్రంలో పశువుల అంగడితో ప్రారంభించారు. ఇప్పుడున్న ప్రభుత్వ దవాఖానా వద్ద అప్పుడు అంగడి నిర్వహించేవారు. దీంతో పాటు కూరగాయాలు,వస్తు సామాగ్రి విక్రయాలు జరిగేవి. ప్రతిశుక్రవారం సంత జరిగేది.సంతలో సరుకులను విక్రయించేందుకు,కొనుగోలు చేసేందుకు ఎడ్ల బండ్లపై ప్రజలు వస్తుండేవారు. అప్పుడు గ్రామాలకు రవాణా సదుపాయం సక్రమంగా లేకపోవడంతో సైకిళ్లు, కాలినడకన వచ్చి వారానికి సరిపోయే వస్తు సామాగ్రిని కొనుగోలు చేసేవారు. రాజాపేటకు 20 కిలోమీటర్ల దూరం నుంచి ప్రజలు వచ్చి కొనుగోలు చేసి వెళ్లేవారు.

పెద్దసంఖ్యలో ప్రజలు

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపూర్, రామచంద్రగూడెం, ఇటికాలపల్లి, కొన్నె, లింగంపల్లి, దబకుంటపల్లి, తుర్కపల్లి మండలంలోని వెంకటాపూర్, గంధమల్ల, దాతర్‌పల్లి, ఇబ్రహీంపూర్, యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయిపల్లి, ధర్మారెడ్డిగూడెం, రాజాపేట మండలంలోని 23 గ్రామపంచాయతీల నుంచి ప్రజలు మండల కేంద్రంలో జరిగే సంతలో క్రయవిక్రయాలు జరిపేవారు.రైతులు పడించిన ధాన్యాన్ని తెచ్చి సంతలో విక్రయించి వచ్చిన డబ్బులతో అవసరాలకు సరిపడే సరుకులను కొనుగోలు చేసేవారు.కొంతమంది ధాన్యాన్ని వస్తుమార్పిడి చేసి సరుకులు కొనుగోలు చేసేవారు. ఈ సంతలో అలీ కల్దార్ నాణేలను వాడేవారు. పైసా, ఏకానా, దోఅణా, చారాణా, ఆటాణా, రూపాయి నాణేలను వినియోగించేవారు. సంతలో వివిధ కిరాణా వస్తువులను భువనగిరి నుంచి ఎడ్ల బండ్ల ద్వారా తరలించి సంతలో విక్రయించేవారు.ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సంత జరిగేది. సంత జనాలతో కిక్కిరిసిపోయేది. కిలోమీటరు పొడవునా సంత జరిగేది. కొంతకాలం తర్వాత గ్రా మంలోని కోట గోడల దర్వాజల మధ్య ప్రధాన రహదారిపై నిర్వహించారు. పశువుల అంగడి రద్దు కా వడంతో కూరగాయల అంగడిగా మారిపోయింది. దానిని బుధ వారానికి మార్చగా మరికొంత కాలానికి గురువారానికి మార్చారు.

వారం	సంతలు జరిగే ప్రాంతాలు
ఆదివారం	రఘునాథపూర్, జాల
మంగళవారం	కుర్రారం, చల్లూరు
బుధవారం	బేగంపేట, సోమారం సింగారం, పాముకుంట
గురువారం	రాజాపేట
శుక్రవారం	బొందుగుల, నెమిల
శనివారం	రేణికుంట

ఇప్పు డిలా..

మండలకేంద్రంలో 75 ఏళ్ల నుంచి జరుగుతున్న సంతను గురువారానికి మార్చడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. కాగా ఊరూరా సంతలు పెరుగడంతో రాజాపేట సంతలో కొనుగోలుదారులు, విక్రయదారులు రోజురోజుకు తగ్గిపోతున్నారు. మండలంలో 23 గ్రామపంచాయతీలు ఉండగా 26 గ్రామాలు ఉన్నాయి. ప్రతీ పంచాయతీలో వారంలో ఏదో ఒకరోజు సంత జరుగుతూనే ఉంటుంది. రాజాపేట సంత 75 ఏళ్ల పూర్తి కాగా రఘునాథ్‌పూర్ సంతకు 40 ఏళ్లు నిండాయి.

75 ఏళ్ల నుంచి సంత జరుగుతోంది



నా వయస్సు 14 ఏళ్లు ఉన్నప్పుడు సంతను ప్రారంభించారు. నా వయస్సు 90 సంవత్సరాలు 75 ఏళ్లుగా సంత జరుగుతుంది. చారాణా పెడితే సంచి నిండా సరుకులు వచ్చి వారానికి సరిపోయేది. ఎటూ 20 కిలోమీటర్ల నుంచి ప్రజలు వచ్చి తమకు అవసరమైన సరుకులను కొనుగోలు చేసేవారు. సంత అంతా జనాలతో కిక్కిరిసి ఉండేది. అప్పటి సంతకు, ఇప్పటి సంతకు ఎంతో తేడా ఉంది.

-పుల్లంగాని సిద్ధయ్య, గ్రామస్థులు, రాజాపేట

వ్యాపారం తగ్గింది



రాజాపేట సంత ఎంతో పురాతనమైనది.కొంతకాలంగా సంతలో కొనుగోలుచేసే జనాలు తగ్గిపోతున్నారు. వ్యాపారాలు తగ్గిపోయాయి. ఆన్‌లైన్ వ్యాపారాలపైనే ప్రజలు మోజు పెంచుకోవడంతో సంతల్లో కూరగాయలు మినహా ఇతర వస్తువులను వినియోగదారులు కొనుగోలు చేయడం లేదు.

- పుల్లూరి శ్రీనివాస్, వ్యాపారి, రాజాపేట

ఊరూరా సంతలతో ఇబ్బందులు



ఊరూరా సంతలు జరుగుతున్నాయి. దీంతో రాజాపేట మండల కేంద్రంలోని సంత తగ్గిపోతుంది. గ్రామాల నుంచి వచ్చే వారు రోజుకింత తగ్గిపోతున్నారు.

- మహంకాళి, కూరగాయల వ్యాపారి, జాల.

ప్రాణం తీసిన సరదా సంభాషణ

● కత్తితో దాడి.. ఒకరు మృతి

● న్యాయం చేయాలని మృతుడి బంధువుల ధర్నా

నాగార్జునసాగర్, జనవరి 15: (ఆంధ్రజ్యోతి): ఇద్దరు స్నేహితుల మధ్య సరదాగా జరిగిన సంభాషణ ఒకరి ప్రాణం తీసింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో జరిగింది. సాగర్ సీఐ బీషన్న తెలిపిన వివరాల ప్రకారం... సాగర్ హిల్‌కాలనీకి చెందిన షేక్ నాగూర్‌భాషా(19) ఎక్సెల్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌లో పనిచేస్తున్నాడు. పైలాన్‌కాలనీకి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. అప్పుడప్పుడు ఒకరినొకరు ఎగతాలి చేసుకుంటూ సరదాగా ఉంటారు. మంగళవారం మధ్యాహ్నం హిల్‌కాలనీ విజయ్‌విహార్ సమీపంలో ఒకరునొకరు సరదా మాటలు అనుకుంటున్న క్రమంలో మాటామాటా పెరిగి ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయమై మాట్లాడటానికి అదే రోజు రాత్రి ఓ పెద్దమనిషి హిల్‌కాలనీలోని సత్యనారాయణస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న ఇంటికి ఇద్దరినీ పిలిపించాడు. ఇద్దరిని కూర్చోబెట్టి మాట్లాడుకొని వెళ్లిపోవాలని చెప్పాడు. ఆ తర్వాత బయటికి వచ్చిన వెంకటేష్ మద్యం మత్తులో ఉండటంతో అప్పటికే తనవెంట తెచ్చుకున్న కత్తితో నాగూర్‌భాషాపై పొట్టలో, వీపుపై పొడిచాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు నాగూర్‌భాషాను స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తీసుకెళ్లాలని తెలిపారు. రాత్రి నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ నాగూర్ భాషా మృతిచెందాడు. నాగూర్‌భాషా మృతికి కారకులైన వారిని శిక్షించి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా, సంఘటన జరిగిన స్థలంలో ప్రధాన రహదారిపై గంట సేపు ధర్నా నిర్వహించారు. వారికి పోలీసులు సర్దిచెప్పి ధర్నా విరమింపజేయించారు. నాగూర్ భాషా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. నాగూర్‌భాషా రాష్ట్రస్థాయి నెట్‌బాల్ క్రీడాకారుడు.





నాగార్జునసాగర్‌లో రాస్తారోకో చేస్తున్న నాగూర్‌భాషా బంధువులు, నాగూర్‌భాషా(ఫైల్‌ఫొటో)

తండ్రి మందలించాడని

యువకుడి ఆత్మహత్య




తరుణ్‌కుమార్(ఫైల్)

వలిగొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వర్కట్‌పల్లిలో తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన మీసాల బిక్షపతి, విజయలక్ష్మి దంపతుల రెండో కుమారుడు తరుణ్‌కుమార్(22) అదే గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. దీంతో తండ్రి మందలించడంతో తీవ్రవేదనకు గురై వ్యవసాయ బావి సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేసుకునే సరికి తరుణ్‌కుమార్ మృతి చెందాడు. తండ్రి బిక్షపతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో మహిళ

భువనగిరి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్లలో మంగళవారం జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం తాజ్‌పూర్‌కు చెందిన ఎస్‌కె అబ్జాజ్‌బీ(32)కి ఇదే మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఎస్‌కే జిలానితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అయితే గత ఆరు నెలలుగా అబ్జాజ్‌బీ తీవ్రకడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించే సరికి మృతి చెందింది. అబ్జాజ్‌బీ తండ్రి ఎండీ బాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌ఎస్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గీత కార్మికుడు....



వీరయ్య (ఫైల్)

మునగాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాములలో విద్యుదాఘాతంతో గీతకార్మికుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఆకుపాముల గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనంతుల వీరయ్య(56) రోజు మాదిరిగానే పొలం వద్దకు వెళ్తున్నాడు. పొలం గట్టు(ఫెన్సింగ్) సమీపంలో మరో రైతు పొలానికి వెళ్తున్న విద్యుత్ వైరు తగలడంతో వీరయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వీరయ్యకు నలుగురు కుమార్తెలు, భార్య ఉన్నారు. వీరయ్య జానపదా కళారంగంలో ప్రావీణ్యుడని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. సర్వారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుమ్మడెల్లి అంజయ్య బైక్‌పై మిర్యాలగూడ వెళ్లి బుధవారం రాత్రి 7గంటల సమయంలో వస్తున్నాడు. ఎల్‌బీనగర్ శివారులో రోడ్డుపై నడుస్తున్న వ్యక్తిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి పడడంతో అంజయ్య తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వెంటనే 108 వాహనంలో మిర్యాలగూడ హాస్పటల్‌కు తరలించారు.

మాంజా తగిలి గాయాలు



గాయపడ్డ నారాయణ

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో మాంజాతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇందులో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గోధుమకుండ గ్రామానికి చెందిన నారాయణ, ఆయన భార్య వీరమణి స్థానిక మెయిన్‌రోడ్డుపై బైక్‌పై గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం వెళ్తున్నారు. స్థానిక మునిసిపల్ సమీపంలో గాలిపటం మాంజా వాహనం నడుపుతున్న వృద్ధుడు నారాయణ మెడకు తగిలి గాయమైంది. దీంతో వెంటనే నారాయణ వాహనానికి బ్రేక్ వేయడంతో వెనక కూర్చున్న భార్య వీరమణి కిందపడటంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో హుటాహుటిన 108 వాహనంలో ఆమెను చికిత్సనిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గ్యాస్ లీకై గుడిసె దగ్ధం

రాజాపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో గ్యాస్ లీకై గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన ఇంజ నవీన్ తమ కుటుంబంతో గుడిసెలో నివసిస్తున్నాడు. బుధవారం ఉదయం వంట గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. కొంత నగదు, గృహోపకరణ వస్తువులు, దుస్తులు దగ్ధమయ్యాయి. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయాన్ని అందజేశారు.



దగ్ధమైన పూరిగుడిసెను పరిశీలిస్తున్న బీర్ల అయిలయ్య

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు, ఆయిల్ చోరీ

భువనగిరి రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువ నగిరి జిల్లా భువనగిరి మండలంలోని ఎర్రంబెల్లి గ్రామశివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌వైరు, ఆయిల్ చోరీకి పాల్పడ్డారు. సంఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. రైతులు మొలుగు దశరథ, పెంటయ్య, చంద్రయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ బావుల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరును, ఆయిల్‌ను చోరీ చేశారని తెలిపారు. దాదాపు 10మంది రైతులకు సంబంధించిన వ్యవసాయ పంపుసెట్ల కలెక్షన్లు కలిగి ఉన్నాయని పేర్కొంటూ ట్రాన్స్‌కో లైన్‌మన్ నానం చర్ల నర్సింహకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు భువనగిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు లైన్‌మన్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో...

భువనగిరి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో మంగళవారం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రగతి నగర్‌కు చెందిన టీ సునంద కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వరంగల్ జిల్లాలోని ఐనవోలు మల్లన్న జాతరకు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.2.25 లక్షల విలువైన 3 తులాల బంగారు నల్లపూసల ఆభరణం చేశారు. ఈ మేరకు ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసం చేసిన వ్యక్తుల అరెస్ట్

నాగార్జునసాగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నమ్మించి అసలు స్థానంలో నకిలీ ఏటీఎం కార్డును ఇచ్చిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సీఐ బీసన్న తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 30వ తేదీన పెద్దవూర మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన తేళ్ల బొబ్బిలి తన ఏటీఎం కార్డుతో మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఏటీఎంలో డ్రా కోసం వెళ్లాడు. అదేసమయంలో అక్కడికి వచ్చిన కృష్ణమూర్తి, ఉండ్రాల కుమార్‌బాబులు బొబ్బిలికి డబ్బులు డ్రా చేసి ఇస్తామని పిన్‌నెంబర్ తీసుకుని ఏటీఎం కార్డును మార్చి ఇచ్చారు. అక్కడ నుంచి ఏపీ 40 ఏహెచ్ 0512 నెంబర్ గల కారులో మల్లెపల్లి వైపు వెళ్లి బొబ్బిలి ఏటీఎం కార్డులో రూ.40 వేలను డ్రాచేసుకున్నారు. సదరు వ్యక్తి డబ్బులు డ్రా చేసుకున్నట్లు మెసేజ్ రావటంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో బుధవారం మధ్యాహ్నం గొడ్డు సుబ్బారావ్, కుమార్‌బాబులు పెద్దవూర మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు ఏటీఎం మార్చినట్లు నేరాన్ని ఒప్పుకున్నారు. సదరు వ్యక్తులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు, చీరాల, బాపట్ల పోలీస్‌స్టేషన్లలోనూ ఏటీఎంలను మార్చుతున్నట్టు కేసులు నమోదయ్యాయని సీఐ తెలిపారు. అంతే కాకుండా పాకాల, నాయడుపేట స్టేషన్ల పరిధిలో బొబ్బిలి ఏటీఎం కార్డును ఉపయోగించి మరో రూ.40 వేలను డ్రాచేసుకున్నారు. అందులో కారు కిరాయికి రూ.8 వేలు క్రిష్ణమూర్తికి రూ.10 వేలు, కుమార్, బాబురావులు చెరో రూ.10 వేలు తీసుకున్నట్లు సీఐ వివరించారు. ముగ్గురి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదించడంలో సహకరించిన ఎస్‌ఐ వీరబాబు, సిబ్బంది శ్రీకాంత్, కిషన్, లోకేష్, హరిలాల్‌ను సీఐ అభినందించారు.

సంక్రాంతి పండుగ పూట విషాదాలు

● ఆరుగురిని బలిగొన్న ప్రమాదాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళ, బుధవారాల్లో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. నల్లగొండ జిల్లాలో నలుగురు, యాదాద్రిభువనగిరి జిల్లాలో ఇద్దరు చొప్పున మృతి చెందారు.



ఆటో కింద పడి మృతి చెందిన శ్రీకాంత్

భువనగిరి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో బోల్తా పడిన ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కొండ శ్రీకాంత్(28) హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి మంగళవారం ఉదయం వచ్చి రాత్రి 10గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో కూనూరు వద్ద వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో శ్రీకాంత్‌పై ఆటోపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తల్లి స్వప్న బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సంతోష్ కుమార్ తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి ..

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయిగిరి ఫ్లైఓవర్ సమీపంలో నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తి(65)ని గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని చికిత్సనిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు రోజుల క్రితం ఆ వృద్ధుడు రాయిగిరి పరిసరాల్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతుండడంతో గమనించిన స్థానికులు సమీపంలోని సహృదయ అనాథ ఆశ్రమంలో చేర్పించారు. కాగా ఆ వృద్ధుడు నిర్వాహకులకు చెప్పకుండా బయటకు వెళ్లడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మృత్యువాతపడ్డాడు. ఆనవాళ్లు తెలిసిన వారు వివరాలకు 8712662472 సెల్ ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు..



వెంకటరమణారెడ్డి(ఫైల్)

వేములపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకటరమణారెడ్డి(50) తన అత్త పద్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. శెట్టిపాలెం గ్రామశివారులోని చేదుడుబాయి వంపు సమీపంలోని కల్వర్టు వద్ద పాములపాడు నుంచి మిర్యాలగూడకు కారులో వెళ్తుండగా బొల్లెద్దు నవీన్ అతి వేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వెంకటరమణారెడ్డికి తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటరమణారెడ్డి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అత్తారింటికి వచ్చి వెళ్తూ...



మాగి స్వామి(ఫైల్)

చిట్యాలరూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు అత్తారింటికి వచ్చి తిరిగి వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఈ నెల 14వ తేదీ రాత్రి జరిగింది. చిట్యాల పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కే మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలకు చెందిన మాగి స్వామి(33) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు తన అత్తగారి ఇళ్లయిన చిట్యాల మండలం గుండ్రాంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రి తన స్వగ్రామమైన వస్తుండగా మార్గమధ్యలో వెలిమినేడు శివారులో హైదరాబాద్ నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి శవపరీక్ష నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.

మూలమలుపు వద్ద..



ప్రేమ్‌కుమార్, అర్జున్ (ఫైల్ ఫొటోలు)

కొండమల్లేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపల్లి మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన మారేపల్లి ప్రేమ్‌కుమార్(27) చిలుకమర్రి గ్రామపరిధిలోని విజయవర్ధన్ కాటన్ మిల్లులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదే మిల్లులో బిహార్ రాష్ట్రానికి చెందిన అర్జున్ సహాని(29) గుమస్తాగా పనిచేస్తున్నాడు. మంగళవారం ప్రేమ్‌కుమార్ అర్జున్ సహానితో కలిసి తన బైక్‌పై కొండమల్లేపల్లి మండలంలో హైదరాబాద్ రోడ్డులో కేశ్యతండా సమీపంలోని టీవీఎన్ రెడ్డి కాటన్‌మిల్లుకు పనినిమిత్తం వెళ్లి, వస్తున్నారు. మార్గమధ్యలో కొండమల్లేపల్లిలోని హైదరాబాద్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ మూలమలుపు వద్దకు చేరుకోగానే కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను అతివేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, అర్జున్ సహానిలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రేమ్‌కుమార్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. ప్రేమ్‌కుమార్ అవివాహితుడు కాగా అర్జున్ సహానికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

200 మందితో బందోబస్తు

● చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



చౌటుప్పల్ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) :సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు ప్రయాణమయ్యారు. వాళ్లు బుధవారం నుంచి తిరుగు ప్రయాణం కావడంతో వాహనాల రద్దీ, వాటి నియంత్రణ, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నట్టు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా 200 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఏసీపీ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి: హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు ఎన్ని వాహనాలు వెళ్లినట్టుగా భావిస్తున్నారు ?

ఏసీపీ : హైదరాబాద్ నుంచి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు 4 రోజుల పాటు దాదాపుగా 3 లక్షల వాహనాలు వెళ్లినట్లు అంచనా.

ఆంధ్రజ్యోతి: జాతీయ రహదారిపై సాధారణ రోజుల్లో ఎన్ని వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి ?

ఏసీపీ : సోమవారం నుంచి శుక్రవారం వరకు సగటున 20 నుంచి 25 వేల, శని, ఆదివారాల్లో సగటున 25 నుంచి 35 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తాయి.

ఆంధ్రజ్యోతి: ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

ఏసీపీ: హైవే పై ఎక్కడ కూడ అడ్డదిడ్డంగా వాహనాలను నిలపకుండ 24 గంటలు పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ అర్డర్ పోలీసులతో కలిపి 200 మంది జాతీయ రహదారిపై విధులు నిర్వహిస్తున్నారు. పంతంగి టోల్‌గేట్ వద్ద 24 గంటలు పోలీస్ నిఘాను ఏర్పాటు చేశాం. హోటల్స్ వద్ద వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయించడంతో పాటు గ్రామాల్లో జంక్షన్ల వద్ద పోలీసులను నియమించాం.

సీఎం ఆదేశాలతో ఏఎమ్మార్పీకి మహర్దశ

● ప్రాజెక్టు పరిధిలోని సిస్టర్న్, మెయిన్‌కెనాల్ లీకేజీలను పరిశీలించిన అధికారుల బృందం

● కంపచెట్ల తొలగింపు పనులు ప్రారంభం





ఏఎమ్మార్పీ ప్రధాన కాలువపై కంపచెట్లను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగింపు పనులు, పుట్టంగండి సిస్టర్న్(రక్షణగోడ) లీకేజీలను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు(ఫైల్)

దేవరకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయించడంతో నల్లగొండ జిల్లాలోని అసంపూర్తి ప్రాజెక్టుల పనుల్లో ముందడుగు పడింది. ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి రిజర్వాయర్‌లు పూర్తిచేయాలనే లక్ష్యంగా నిధులు కేటాయిస్తూ ముందుకు వెళతున్నారు. అందులో భాగంగా నల్లగొండ జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలతో పాటు జిల్లాలోని 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఎలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) మరమ్మతులు, సిస్టర్న్ లీకేజీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇటీవల ప్రాజెక్టును అధికారుల బృందం సందర్శించింది. సిస్టర్న్ లీకేజీలను అరికట్టేందుకు చర్యలతో పాటు కాల్వల మరమ్మతులు, కంపచెట్లు తొలగింపునకు నిధులు కేటాయింపుపై చర్చించారు. మొదటగా ఏఎమ్మార్పీ ప్రధానకాలువతో పాటు కట్టపై ఏపుగా పెరిగిన కంపచెట్లు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. 2.30 కిలోమీటర్ల ఆనకట్టపై 1.9 కిలోమీటర్ల నుంచి ఎక్స్‌కవేటర్లతో కంపచెట్లు తొలగింపు పనులను మొదటగా ప్రారంభించారు. కొన్నేళ్ల తరువాత మరమ్మతులకు మోక్షం లభించడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ప్రధానకాలువ డిస్ట్రిబ్యూటరీలు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి కాల్వలు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నీరు విడుదల చేస్తే వృథాగా పోయే పరిస్థితి నెలకొంది. 2001లో ఏఎమ్మార్పీ ప్రాజెక్టును ప్రారంభించారు. నాలుగు మోటార్ల ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టు పరిధిలోని 90 చెరువులను నింపడం, హైదరాబాద్ జంటనగరాలతోపాటు జిల్లాకు తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టును ప్రారంభించారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వతో పాటు డిస్ట్రిబ్యూటరీలు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులు కంపచెట్ల తొలగింపు, మరమ్మతులకు కోటి రూపాయలు ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీశైలం సొరంగమార్గం, ఎస్ఎల్‌బీసీ, డిండి, పెండ్లిపాకల, నక్కలగండి ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టిసారించింది. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌లు జిల్లాలోని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలని, సిస్టర్న్ (రక్షణగోడ) లీకేజీలను అరికట్టాలని, అధికారులు సర్వే నిర్వహించి పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టు ప్రధాన కాల్వ ప్రాజెక్టు నుంచి ఉదయ సముద్రం వరకు 136 కిలోమీటర్లు ఉంది. 60కిపైగా మేజర్ కాల్వలు ఉన్నాయి. నీటి నిర్వహణ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కాల్వలు శిథిలావస్థకు చేరాయి. డిస్ట్రిబ్యూటరీలు కొన్నేళ్లుగా కంపచెట్లు పెరిగి ఆనవాళ్లు కోల్పోయే దుస్థితి. ఏఎమ్మార్పీ నుంచి ఉదయసముద్రం వరకు 136 కిలోమీటర్లు ప్రధాన కాలువ ద్వారా సాగు, తాగునీరు అందుతుంది. జిల్లాలోని దేవరకొండ, నాగార్జునసాగర్, నల్లగొండ, నకిరేకల్ నాలుగు నియోజకవర్గాలలో ఈ ప్రాజెక్టు విస్తరించి ఉంది. ప్రాజెక్టు మరమ్మతులకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంపచెట్లు తొలగింపు పనులు ప్రారంభించాం

ఏఎమ్మార్పీ ప్రధాన కట్టపై కంపచెట్లు తొలగింపు పనులు ప్రారంభించాం. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు ప్రధాన కాలువ మరమ్మతులు, సిస్టర్న్ లీకేజీలు అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. నీరు వృథా కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

సత్యనారాయణ, ఈఈ, ఏఎమ్మార్పీ డివిజన్4

పల్లె వదిలి పట్నం వైపు..

● పండుగ తర్వాత హైదరాబాద్‌కు కదులుతున్న వాహనాలు

● హైవేపై మళ్లీ వాహనాల సందడి





నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాలబారులు, యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో హైదరాబాద్ మార్గంలో వాహనాలు

కోదాడ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు సొంతూర్లకు వెళ్లిన పట్టణవాసులు తిరిగి తమ స్వస్థలాలకు బయలుదేరుతున్నారు. దీంతో బుధవారం సాయంత్రం నుంచి విజయవాడ- హైదరాబాద్ జాతీయ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. రామాపురం క్రాస్‌రోడ్డు, చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద, దుర్గాపురం, కొండాపురం జంక్షన్ల వద్ద తిరిగి బందోబస్తు చేపట్టారు.

విజయవాడ-హైదరాబాద్ హైవేపై వాహనాల రద్దీ

కేతేపల్లి: పండుగ సెలవులు ముగియడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. దీంతో బుధవారం ఉదయం నుంచి 65వ నెంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ తిరిగి ప్రారంభమైంది. రెండు రోజుల పాటు వాహనాల రాకపోకలు లేక బోసిపోయి కనిపించిన జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు రోడ్డు బుధవారం వాహనాలు కదిలాయి. మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో గల 12టోల్ వసూలు కౌంటర్లలో వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ వైపుకు వెళ్లే వాహనాలకు ఏడు కౌంటర్లు, విజయవాడ వైపుకు వెళ్లే వాహనాలకు 5కౌంటర్లు కేటాయించారు.

తిరుగు ముఖం పట్టిన పట్నంవాసులు

చౌటుప్పల్‌టౌన్, చౌటుప్పల్‌రూరల్:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై సంక్రాంతి వాహనాలు బుధవారం తిరుగు ముఖం పట్టాయి. ఏపీలోని సొంతూళ్ల కు వెళ్లిన ప్రజలు హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు.

రహదారిపై మంచు దుప్పటి

చిట్యాల రూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల జాతీయ రహదారిని మంగళవారం మంచు దుప్పటి కప్పేసింది. వేకువజామునే దట్టంగా పొగ మంచు అలుముకుని నివాసాలు, చెట్లు, వాహనాలు దగ్గరికెళితే కాని కనిపించి కనిపించని విధంగా ఉంది. దీంతో వాహనాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

అధ్యయనోత్సవాలు సమాప్తం



స్వామిఅమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు బుధవారం లక్ష్మీనరసింహుడి అలంకరణతో పరిసమాప్తమయ్యాయి. వైకుంఠనాథుడు శ్రీమన్నారాయణుడితో పాటు భక్తుల పూజలు అందుకునే ఘట్టాలను ఆచార్యులు సంప్రదాయరీతిలో నిర్వహించారు. ప్రబంధ పారాయణికులు ఆలపిస్తూ తిరువీధి సేవ నిర్వహించారు. ముందుగా ఆలయంలో నవకలశాలకు పూజలు నిర్వహించిన పండితులు ఆళ్వార్లు, ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనాలు చేశారు. వేదమంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని తిరువీధుల్లో ఊరేగించారు. దశావతారాల్లో నాలుగో అవతారమైన నరసింహ అవతార విశిష్టతను పండితులు భక్తులకు వివరించారు. అధ్యయనోత్సవాల్లో పారాయణికులు దివ్య ప్రబంధ పారాయణం చేయగా, ఆలయ అధికారులు వారిని సన్మానించారు. అలాగే గత నెల 16 నుంచి ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు ఈ నెల 13న నిర్వహించిన గోదాదేవి-శ్రీరంగనాథుడి పరి ణయం అనంతరం 14న ఒడి బియ్యం పోసి మొక్కు తీర్చుకున్నారు. వేడుకల్లో ఈవో ఏ.భాస్కర్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఆలయ అధికారులు దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప్ నవీన్‌కుమార్‌శర్మ, పర్యవేక్షకులు నాగుల మహేష్‌గౌడ్, రాజన్‌బాబు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిత్య పూజలు

స్వామివారి సన్నిధిలో ఆరు రోజుల పాటు కొనసాగిన అధ్యయనోత్సవాల్లో భాగంగా రద్దుచేసిన నిత్య, శాశ్వత పూజలు గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. స్వామివారికి నిత్య, శాశ్వత కల్యాణోత్సవం, మొక్కు బ్రహ్మోత్సవాలు, సుదర్శన హోమం తిరిగి ప్రారంభించనున్నట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. ఆదే విధంగా ఈ నెల 20న ఉదయం 7గంటలకు స్వామివారి హుండీల లెక్కింపు కొండ కింద వ్రత మండపంలో నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

వటపత్రశాయిగా లక్ష్మీనరసింహుడు

ఆలయంలో ఆళ్వారు దివ్య ప్రబంధ అధ్యాయనోత్సవాలు ఐదో రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. ఆలయంలో ఉదయం లక్ష్మీనరసింహులను వటపత్రశాయుడిగా, రాత్రి పరమపదనాథుడిగా (వైకుంఠనాథుడు) బంగారు అభరణాలు, వజ్ర వైఢూర్యాలు, వివిధ రకాల పుష్పమాలికలతో దివ్య మనోహరంగా అలంకరించి స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి అలంకార ఊరేగింపు సేవ వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధానార్చకుడు నల్లందీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు బృందం, పారాయణికులు నిర్వహించారు.



గుట్టలో తిరువీధి ఊరేగింపులో ప్రబంధ పారాయణాన్ని పఠిస్తున్న పారాయణికులు

యాదగిరిక్షేత్రం జన సంద్రం

(5వ పేజీ తరువాయి)

ధనుర్మాసోత్సవాలు, సంక్రాంతి పండగ దినాలు కలిపి సుమారు 2,09,000మంది భక్తులు క్షేత్ర సందర్శనకు వచ్చారు. వీరి కోసం తగినన్ని ఆర్టీసీ బస్సులు అధికారులు ఏర్పాటు చేయగా, కొంతమంది వ్యక్తిగత వాహనాలు, ఆటోల్లో కూడా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వాహనాల్లో క్షేత్ర సందర్శనకు తరలిరావడంతో పార్కింగ్ ప్రదేశం లేక కొండపైన ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో పార్కింగ్ స్థలం లేనందున భక్తులు వాహనాలను కొండకింద పార్కింగ్ చేసి ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. మూడో ఘాట్ రోడ్డు వద్ద వాహనాలను కొండపైకి 15నిమిషాలకు ఒకసారి అనుమతించారు. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ కారణంగా సామాన్య భక్తులు బస్సులు ఎక్కేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రోటోకాల్ కార్యాలయానికి వీఐపీ భక్తుల తాకిడి కూడా పెరిగింది. ఇదిలా ఉండగా, స్వామివారి దర్శనానికి వచ్చిన దివ్యాంగులు, వృద్ధులు, చంటిపిల్లల తల్లులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తూర్పు రాజగోపురం వద్దకు భక్తులను తరలించేందుకు దేవస్థానం బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి తెచ్చింది. వీటిలో వెళ్లేందుకు భక్తులు పోటీపడగా, పైకి ఎక్కేటప్పుడు నడకదారిన వెళ్లే భక్తులు, అధిక లోడుతో ఉన్న వాహనాలకు అడ్డుగా రావడంతో డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు. పలుమార్లు బ్రేక్ వేసి ముందుకు కదిలిచ్చే సరికి వాహనాలు మొరాయించాయి. ఇక వ్యక్తిగత వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి చేరుకున్న భక్తులు కొండపైన బస్టాండ్ ప్రాంగణం నుంచి ఉచిత దర్శన క్యూలైన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి క్యూకాంప్లెక్స్ ద్వారా గోల్డెన్ క్యూలైన్ ద్వారా తూర్పు, త్రితల రాజగోపురం గుండా ఆలయంలోకి చేరుకున్నారు. అదేవిధంగా రూ.150 వీఐపీ దర్శన క్యూలైన్ కూడా తూర్పురాజగోపురం ద్వారా ఆలయంలో ప్రవేశించింది. దీంతో ఉభయ క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



ఆలయంలో భక్తుల రద్దీ

● ఆరు రోజుల్లో యాదగిరిగుట్ట ఆలయ ఆదాయం ఇలా..

కైంకర్యం	10న (రూపాయల్లో)	11న	12న	13న	14న	15న
తలనీలాలు	35,000	65,000	1,00,000	40,000	70,000	40,000
ప్రధాన బుకింగ్	11,600	41,800	97,900	56,400	52,296	71,100
కైంకర్యాలు	-	1,800	1,000	1,100	1,500	-
సుప్రభాతం	2,500	11,300	15,700	7,100	2,700	4,400
బ్రేక్ దర్శనం	50,100	3,36,300	4,06,500	1,61,700	6,59,700	76,500
వ్రతాలు	46,400	82,400	1,05,600	1,22,400	55,200	50,400
వాహన పూజలు	6,700	15,800	21,300	26,300	10,100	5,200
వీఐపీ దర్శనం	1,50,000	3,30,000	9,00,000	4,65,000	12,90,000	6,30,000
ప్రచార శాఖ	44,600	42,150	64,550	78,095	46,000	51,335
పాతగుట్ట	22,200	15,590	41,060	18,860	26,910	22,980
వాహన పార్కింగ్	2,00,000	4,00,000	7,00,000	5,50,000	7,00,000	5,50,00
యాదరుషి నిలయం	50,288	75,670	2,03,840	72,438	96,228	72,984
సువర్ణ పుష్పార్చన	48,832	86,800	94,400	94,800	68,400	69,800
శివాలయం	11,550	9,800	9,900	12,800	15,300	12,000
శాశ్వత పూజలు	15,000	35,000	25,000		-	30,000
పుష్కరిణి	750	1,350	2,150	1,350	1,000	1,550
ప్రసాద విక్రయం	9,16,430	9,04,330	17,26,650	13,46,850	15,08,690	13,69,420
లాకర్స్	360	160	260	320	360	280
అన్నదానం	7,738	12,209	3,16,924	73,323	9,823	17,801
విమానగోపురం	1,20,879	39,737	2,23,264	11,111	1,04,118	3,467
లీజులు	-	4,00,000	-	12,00,000	-	-
ఇతరములు	25,000	1,17,000	41,310	6,611	20,573	-
మొత్తం	17,65,927	30,24,196	50,74,808	43,46,558	47,36,325	30,99,790

సంక్రాంతి సంబురం

(5వపేజీ తరువాయి)

సంక్రాంతి సందర్భంగా ప్రయాణాలు, మద్యం, మాసం, పిండి, ఇతరత్రా వాటిపై ఉమ్మడి జిల్లా వాసులు సుమారు రూ.118.46కోట్లు ఖర్చు చేసినట్టు అంచనా.

మాంసంపైనా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,144 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పండుగ నేపథ్యంలో ఒక్కో గ్రామంలో సుమారు 25 గొర్రెలు, మేకల మాంసం విక్రయించినట్టు అంచనా. ఒక్కో జీవానికి 25 కిలోల మాంసం చొప్పున మొత్తం ఒక్కో గ్రామంలో 625 కిలోల చొప్పున విక్రయాలు కొనసాగాయి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని సుమారు 1,114 గ్రామాల్లో 7.15లక్షల కిలోల మటన్ విక్రయాలకు కిలో రూ.800చొప్పున రూ.57.20కోట్లు ఖర్చు చేసినట్టు అంచనా. అదే విధంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 240 చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో ఈనెల 13, 14న ఒక్కో దుకాణంలో 2వేల కిలోల చొప్పున మొత్తంగా 4.80లక్ష కిలోల చికెన్ విక్రయాలు జరిగినట్టు సమాచారం. కిలో రూ.200చొప్పున ఉమ్మడి జిల్లా వాసులు రూ.9.60కోట్లు చికెన్‌పై వ్యయం చేశారు.

● సిబ్బంది సహకారంతోనే



పండుగకు ప్రయాణికులను గమ్యానికి చేర్చాలనే లక్ష్యంతోనే సిబ్బంది వారి ఇంట పండుగను మరిచి పనిచేశారు. దీంతో ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చాం. అదే విధంగా సంస్థకు సాధారణ రోజులతో పోల్చితే పండుగ సందర్భంగా రూ.85లక్షల అదనపు ఆదాయం రావడం సంతోషంగా ఉంది. పండుగ అనంతరం ప్రయాణికుల తిరుగు ప్రయాణానికి సైతం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతాం.

- జానిరెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్

వైద్య సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

• ఎనిమిది మంది సిబ్బందిపై వేటు

• గుర్రంపోడు పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్



నల్లగొండ జిల్లా గుర్రంపోడులో వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

గుర్రంపోడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వైద్యసిబ్బందిపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కొరడా ఝులిపించారు. గుర్రంపోడు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఒక్క ఏఎన్ఎం మాత్రమే ఉండటంతో ఆమె విస్తుపోయారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి ఒక్కొక్కరి పేరును చదివి వారు ఎక్కడున్నారని ఏఎన్ఎంను ప్రశ్నించారు. కనీసం సెలవు చీటీ అయినా చూపించాలని అడిగారు. ఏఎన్ఎం పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆరుగురు కాంట్రాక్టు ఉద్యోగులను విధుల నుంచి తొలగించడంతో పాటు ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వం ఎలాంటి సెలవు ప్రకటించకున్నా బాధ్యత లేకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది మొత్తం విధులకు గైర్హాజరుకావడం శోచనీయమని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వోగా పనిచేస్తున్న హరిలాల్ మరోచోట డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. కాగా, విధులకు గైర్హాజరైన కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఫార్మసిస్టు శ్యామ్, ల్యాబ్ టెక్నీషియన్ సంధ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ మాధవి, అటెండర్లు శ్రీనివాస్, అరుణజ్యోతి, యల్లమ్మను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులు ఫార్మసిస్టు భాగ్యమ్మ, అటెండర్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరయ్యే ప్రతీ ఉద్యోగిపై ఇలాంటి చర్యలే తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నా, ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని గాలికి వదిలేసి సిబ్బంది గైర్హాజరవడం బాధాకరమన్నారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

తేలనున్న భూముల లెక్కలు

(5వ పేజీ తరువాయి)

సాగుకు అనుకూలంగా లేని భూముల వివరాలు పూర్తి స్థాయిలో సేకరించే పనిలో ఉన్నారు. పంచాయతీ అధికారుల నుంచి, ఇరిగేషన్ శాఖ నుంచి, పరిశ్రమల శాఖ నుంచి వివరాలు ఇప్పటికే చాలా వరకు సేకరించినట్టు సమాచారం. వెంచర్లు, లేఅవుట్‌లు చేసిన, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా సాగు భూముల లెక్కలు తేల్చి 25వ తేదీ నాటికి ఆన్‌లైన్ నమోదు చేయడం ద్వారా పారదర్శకంగా రైతు భరోసా చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో నిర్ణయించిన మాదిరిగా రైతు భరోసా కోసం రైతుల నుంచి ఎలాంటి దరఖాస్తులు తీసుకోవడం లేదు. ఇప్పటికే అధికార యంత్రాంగం వద్ద వివిధ రూపాల్లో తీసుకున్న లెక్కలు సిద్ధంగా ఉండటంతో పాటు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే క్షేత్రస్థాయి పరిశీలనతో సాగు భూముల లెక్కలు తేలనున్నాయి. మొత్తానికి ప్రభుత్వం రైతు భరోసా' నిధులు కేటాయిస్తుండటంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు.

పకడ్బందీగా క్షేత్రస్థాయి పరిశీలన : పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు సాగు భూముల లెక్కలు తేల్చేందుకు పకడ్బందీగా క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నాం. ప్రతీ సర్వేనెంబర్ పరిశీలించి సాగుకు యోగ్యంగా లేని భూముల వివరాలు, సాగుకు అనుకూలంగా ఉన్న భూముల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. ఈ నెల 26న రైతు భరోసా' నిధులు అర్హులైన ప్రతీ ఒక్క రైతు బ్యాంకు ఖాతాలో జమకానున్నాయి.

ఆపరేటర్ల అవస్థలు

» తక్కువ వేతనంతో వెట్టిచాకిరి
» పురోగతి లేని జీవితాలు
» ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



నల్లగొండ పట్టణంలోని మీసేవ కేంద్రం

నల్లగొండ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ వేతనంతో ప్రభుత్వ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్న ఈ సేవా (మీసేవ) కేంద్రాల్లో పని చేస్తున్న ఆపరేటర్ల పరిస్థితి అధ్వానంగా మారింది. 2004లో చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు సేవలు నేరుగా అందించేందుకు ఈసేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వం నేరుగా ఈసేవా కేంద్రాలను నిర్వహించకుండా ఇతర ఏజెన్సీలకు అప్పగించారు. వాటిని నిర్వహించేందుకు గ్రామీ ణ ప్రాంతాల్లో ఫ్రాంచైజీల ద్వారా కొంతమంది నిరుద్యోగ యువకులకు అప్పగించారు. పట్టణ ప్రాంతాల్లో మాత్రం ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో ప్రభుత్వం భవనాలను అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నారు. అందుకోసం నిరుద్యోగ యువకులను నియమించుకున్నారు. ఈ నియామకం కూడా ఏజెన్సీలు కాకుండా జిల్లా అధికారుల సమక్షంలో వారిని నియమించుకోవడంతో పాటు, నగదును బ్యాంకుల్లో జమ చేసేందుకు అధికారులు పర్యవేక్షించారు. మేనేజర్, ఆపరేటర్లను రిక్రూట్‌మెంట్ చేసుకున్న సమయంలో వారికి వేతనాలు ఆపరేటర్‌కు రూ. 1200, మేనేజర్‌కు రూ. 1500 చొప్పున అందజేశారు. అప్పటి నుంచి 20 సంవత్సరాల కాలంలో నాలుగు ఏజెన్సీలు మారాయి. మొదటగా సీఎంఎస్, హెచ్‌సీఎల్ శ్రీవెన్. నెటెక్సల్, ప్రస్తుతం ప్రభుత్వం మీసేవ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థ ద్వారా వారికి వేతనాలు అందుతున్నాయి. 20 సంవత్సరాల కాలంలో రూ.1200 నుంచి రూ. 12వేల వరకు వేతనాలు పెరిగాయి. వీరికి ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు. ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డులు సౌకర్యాలు కల్పించలేదు. మారుతున్న కాలంలో ఒక కుటుంబ పోషణకు కుటుంబాలు గడపలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిని ప్రభుత్వం సంస్థ ఉద్యోగులుగా గుర్తించి, కనీసం రూ.30 వేలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మీసేవాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో టీఎస్‌ఎటీస్ ఆధ్వర్యంలో పట్టణ పాంత్రాల్లో ఆరు కేంద్రాల ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో ప్రభుత్వ మీసేవా (ఈసేవా) కేంద్రాలను నిర్వహిస్తున్నారు. నల్లగొండ పట్టణంలో రెండు కేంద్రాలు అందులో 1 మేనేజర్, 4 ఆపరేటర్లు ఉన్నారు. మిర్యాలగూడెంలోని ఒక కేంద్రం అందులో 3 ఆపరేటర్లు, సూర్యాపేటలో రెండు కేంద్రాల్లో ఐదుగురు, యాదాద్రి భువనగిరి పట్టణంలో ఒక కేంద్రంలో 2 ఆపరేటర్లు పనిచేస్తున్నారు.

తక్కువ వేతనంతో ఇబ్బందులు పడుతున్నాం



గత 20 సంవత్సరాలుగా కేంద్రంలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. చేరినప్పుడు రూ.1500 ఇచ్చారు. అప్పటి నుంచి నేటి వరకు ఇందులోనే మేనేజర్‌గా పనిచేస్తున్నాను. ప్రస్తుతం అన్ని పీఎఫ్ కటింగ్‌లు పోను రూ. 14,500 వస్తుంది. జీతం అద్దెకు కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదు. పిల్లల చదువు కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మల్లేష్, పట్టణ సెంటర్ మేనేజర్

20 సంవత్సరాలు వెట్టి చాకిరి



పురోగతి ఉంటుందని మీసేవా ఆపరేటర్‌గా చేరాను. 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్నా. ప్రజలకు ప్రభుత్వ పరమైన ఎన్నో సదుపాయాలు వారికి అందేలా చేస్తున్నాం. ప్రస్తుతం ఇస్తున్న వేతనం సరిపోవడం లేదు. ఇతర శాఖల్లో పనిచేసే వారికి మంచి వేతనం ఇస్తున్నారు. విస్తృతమైన సేవలు అందిస్తున్న కనీస వేతనం ఇవ్వాలి.

సరిత, ఆపరేటర్,నల్లగొండ

ఎల్లమ్మ ఆలయానికి
సంక్రాంతి రద్దీ

● భక్తుల మొక్కులు చెల్లింపు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణు కా ఎల్లమ్మ ఆలయానికి సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని మంగళ, బుధవారాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె, ఒడిబియ్యం, నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించుకొని మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన ధనుర్మాసోత్సవాలు

● స్వామివారి పవళింపు సేవ


పవళింపు సేవలో స్వామివారు

నల్లగొండ కల్చరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు వైష్ణవాలయాల్లో 30 రోజుల పాటు నిర్వహించిన ధనుర్మాస వ్రత మహోత్సవాలు ముగిశాయి. రామగిరిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీమాన్ భాష్యం జగన్నాథచార్యులు ఆధ్వర్యంలో 30 రోజుల పాటు ఆండాళ్ అమ్మవారు రచించిన తిరుప్పావై పాశురాలను ప్రవచనం చేశారు. ప్రతీరోజు అమ్మవారి వ్రత విశేషాలను భక్తులకు వివరించారు. శ్రీగోదా రంగమన్నార్ల కల్యాణమహోత్సవం కన్నుల పండువగా సాగింది. మంగళవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయంలోని అమ్మవారికి ఒడిబియ్యం, గోదా రంగనాథుల పవళింపు సేవ కార్యక్రమాలు, అర్చకస్వాములు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. దీంతో ధనుర్మాస ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ధనుర్మాస ఉత్సవాల్లో ప్రవచనం చేసిన శ్రీమాన్ భాష్యం జగన్నాథచార్యులు, స్థానాచార్యులు, రామారంగాచార్యులు, యాదగిరిచార్యులు, శఠగోపాలాచార్యులు, రఘునందనాచార్యులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పండితులను సత్కరించారు. అదేవిధంగా పానగల్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 30 రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు భక్తితో సాగాయి. అదేవిధంగా వీటికాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఎంసీ పద్మ ఆధ్వర్యంలో 30రోజుల పాటు ధనుర్మాస ప్రవచనాలను భక్తితో చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బుర్రి చైతన్య, చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణి, వికాస తరంగిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లికంటి పార్వతమ్మ మృతి బాధాకరం

● సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యానికి మాతృవియోగం
● నివాళులర్పించిన పార్టీ నాయకులు


మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ మృతి బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఎలుగులగూడెం గ్రామంలో నెల్లికంటి పార్వతమ్మ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. వారితో పాటు వివిధ పార్టీల నాయకులు బీజేపీ రాష్ట్ర నాయకుడు భవనం మధుసూదన్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, గన్న చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకుడు ఉజ్జయిని రత్నాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఉజ్జయిని యాదగిరిరావు, భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ ఓబీసీ జిల్లా నాయకులు బుడద లింగయ్య యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వట్టికోటి శేఖర్, వివిధ పార్టీల మండలాల అధ్యక్షులు బీమనపల్లి సైదులు, పెంబల జానయ్య, సాగర్ల మల్లేష్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి


బాధితుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి

తిప్పర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నల్లగొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని సర్వారం గ్రామంలో నాలుగు రోజులుగా కొంత మంది గ్రామస్థులకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయని వచ్చిన సమాచారంతో బుధవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటి వరకు అస్వస్థతకు గురైనవారు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. వారు తీసుకున్న ఆహారం, తాగునీరు వంటి విషయాలను వారి నివాసాలకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలోని తాగునీటి ట్యాంకుల్లో ఉన్నటువంటి నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామం మొత్తంలో ఇప్పటి వరకు 31 మంది అస్వస్థతకు గురైనట్లు తిప్పర్తి మండల వైద్యాధికారి ప్రదీప్‌బాబు తెలిపారు. మరో రెండు రోజుల పాటు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి సదుపాయాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బీసీ డిక్లరేషన్ హామీని నెరవేర్చాలి

మునుగోడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీని నెరవేర్చాలని ఓబీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ అవ్వారు వేణుకుమార్ డిమాండ్ చేశారు. మునుగోడులో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోవటం విచారకరమన్నారు. ఎన్నికల హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొట్ల వాసుదేవ్, ఎస్‌బీఎస్ చారి, ముత్యాలు, మల్లేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మకర సంక్రాంతి, కనుమ వేడుకలను జిల్లా ప్రజలు ఆనందోత్సాహల మధ్య నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు పతంగులను ఎగురవేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నోములు ఆచరించారు. వాకిళ్ల రంగురంగుల హరివిల్లులను తలపించాయి. భవనాలపై యువకులు గుంపులు, గుంపులుగా పతంగులను ఎగురవేస్తూ సందడి చేశారు. డీజేలతో హోరెత్తిస్తూ నృత్యాలు చేశారు. కనుమ రోజున రైతులు పశువులకు పూజలు చేసి పొలం పనులు ప్రారంభించారు. భక్తులతో ఆలయాలన్నీ రద్దీగా మారాయి. రామగిరిలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం భక్తులతో కళకళ లాడింది. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని అర్చనలు చేశారు. అదే విధంగా తులసీనగర్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయం, షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, ఆనంద్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, వీటీ కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, బీట్ మార్కెట్‌లోని శ్రీ రామకోటి స్తూప దేవాలయం, పానగల్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, పచ్చల, ఛాయా సోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు తదితరులు ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో గోమాత పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బండారు ప్రసాద్, అనూష, రామాంజనేయులు, రమణమ్మ, ఏడుపటి పద్మ, రాధిక, బండారు కళ, బండారు వర్ష, కూనాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు


నల్లగొండలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న మహిళలు

కేతేపల్లితో పాటు భీమారంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి బహుమతులను అందజేశారు. రైతులు గోవులు, ఎద్దులు, పాడి పశువులను కడిగి పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నార్కట్‌పల్లిలో సంక్రాంతి సందర్భంగా వాయినాల నోము నిర్వహించారు. తినబండారాలైన నువ్వుల ముద్దలు, ఇంట్లో నిత్యం వాడుకునే వస్తువులను వాయినాలుగా ఇచ్చే నోములకు ప్రత్యేక పూజలు చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆమనగంటి ఐలయ్య, యనమల్ల శ్రీను, మల్లయ్య, అరుణజ్యోతి, అండాలు, పూలమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా నిర్వహించారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలతో గ్రామాల్లో సందడి నెలకొంది. చిన్నా పెద్ద తారతమ్యాలు లేకుండా గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు.


చిట్యాల: వట్టిమర్తిలో ఇంటి ముంగిట ముగ్గు వేసి రంగులను అద్దుతున్న తల్లీ కూతుళ్లు


వీటీకాలనీలో గోమాతకు పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకుడు బండారు ప్రసాద్


కేతేపల్లి: ముగ్గుల పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

పథకాలకు అర్హులనే ఎంపిక చేయాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కట్టంగూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ వంటి పథకాలకు అధికారులు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికపై అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 21 నుంచి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అందులో అర్హులైన ముసాయిదా వివరాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీవో చింతమల్ల చలపతి, ఏవో గిరిప్రసాద్, ఏపీవో కడెం రాంమోహన్, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలు పకడ్బందీగా అమలుచేయాలి

కేతేపల్లి: ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలులోకి తీసుకురానున్న నాలుగు ప్రజాసంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్, మండల ప్రత్యేక అధికారి జె.హరీష్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, ఆర్ఐ చాంద్‌పాషా, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుపై అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించి, అర్హులై న లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. గ్రామసభలో ల బ్ధిదారుల పేర్లు చదివి వినిపించి మంజూరు చేసి ఈ నెల 26 తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో మున్నయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, యూసుఫ్, యాకుబ్, ఎంపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశం లో మండల ప్రత్యేకాధికారి చరిత మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపికకు షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయి సర్వే చేయాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో ఉమేష్‌చారి, ఏవో గౌతమ్ పాల్గొన్నారు.

● కనగల్‌లో మండల ప్రత్యేకాధికారి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులు టీం సభ్యులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారుల ను ఎంపిక చేయాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎంపీవో సుమలత కార్యదర్శులు, ఏఈవోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే తల్లి మరియమాత

● పీఠాధిపతి దమన్‌కుమార్


మరియమాతకు పూజలు చేస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్ తదితరులు

నల్లగొండ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భక్తితో కొలిచే భక్తుల కోరికలు తీర్చేతల్లిగా మరియమాత అమ్మవారు ప్రసిద్ధి చెందిందని నల్లగొండ పీఠాధిపతి దమన్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డు మరియగిరి కొండపై వెలిసిన మరియమాత మహోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బుధవారం బలిపూజ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. అమ్మవారిని భక్తితో కొలిస్తే అనుగ్రహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిమార్గాన్ని అనుసరించి జీవితాలను సుఖమయం చేసుకోవాలన్నారు. మరియమాత తిరునాళ్లకు భక్తులు విశేషంగా రావడం అమ్మగొప్పతనమన్నారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతోనే మరియాగిరి కొండ నేడు అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మరియగిరి కొండ డైరెక్టర్ రేవరెండ్, తుమ్మ జోసఫ్ రెడ్డి, ఫాదర్లు జగదీష్, అల్లా రెడ్డి, బాలశౌరీరెడ్డి, హృదయ్ కుమార్‌రెడ్డి, బాల ఇన్నా, చర్చీ కౌన్సిల్ సభ్యులు పసుల శౌరయ్య, మర్రిరెడ్డి, నామా మర్రయ్య, ప్రేమ్ కుమార్, కిరణ్, జోజి, రాజశేఖర్, ఆరోగ్యం, శ్యాంసన్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం మరియామాత అమ్మవారిని ప్రత్యేక వాహనంలో పురవీధుల గుండా శోభాయమానంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

నేడు చెర్వుగట్టుపై జాతర సమన్వయ సమావేశం

నార్కట్‌పల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల మొదటి వారంలో జరగనున్న చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిమిత్తం ఈ నెల 16న సమన్వయం సమావేశం ఏర్పాటు చేసినట్లు దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు సంబంధిత ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

'భూనిర్వాసితులు అధైర్య పడవద్దు'

మర్రిగూడ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాల భూనిర్వాసితులు అధైర్యపడవద్దు, ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని రాష్ట్ర ఆదివాసీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మర్రిగూడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే తొమ్మిదేళ్లుగా ముంపు గ్రామాల బాధితులు పునరావాస స్థలం కేటాయించడంలో లబ్ధిపొందలేక పోయినట్లు తెలి పారు. అయితే వీరికి మొదటగా రిజర్వాయర్‌కు అతిసమీపంలో ఉన్న నర్సిరెడ్డిగూడెం గ్రామ బాధితులైన 289 మందికి చింతపల్లి మండలం సాయిబాబా దేవాలయం వెనక భాగంలో ఇంటిస్థలం కేటాయించి పట్టా ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు. మిగతా వారికి కూడా ప్రభుత్వం అందజేస్తుందని, ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు బంగారం, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక


బిక్కి రాజశేఖర్

శాలిగౌరారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం శాలిగౌరారం మండల నూతన కమిటీని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా తుడిమిడి గ్రామానికి చెందిన బిక్కి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు నారగోని నాగరాజ, ప్రధాన కార్యదర్శి బండారు యాదగిరి, కార్యదర్శి బండారు ధనుంజయ్య, గౌరవాధ్యక్షుడిగా గడ్డం వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మరణించిన గురుస్వామికి ఆర్థికసాయం


శాలిగౌరారం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల ప్రతినిధి, శివమాల గరుస్వామి తమ్మిశెట్టి రమణయ్య (52) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రమణయ్య చిత్రపటానికి శివమాలధారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రమణయ్య అకాలమృతి తీరని లోటని అన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

వీహెచ్‌పీ మాతృశక్తి ఆధ్వర్యంలో చీరల పంపిణీ

శాలిగౌరారం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం అడ్లూర్ గ్రామంలో వీహెచ్‌పీ మాతృశక్తి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నకిరేకల్ ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ షాపింగ్ మాల్ ఎండీ గట్టు శ్యాంసుందర్, లయన్స్ క్లబ్ పాస్ట్ జోన్ చైర్మన్, అశోక టెక్స్‌టైల్స్ ఎండీ రావిరాల అశోక్‌లు చీరలు, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాతృశక్తి జిల్లా ప్రతినిధులు సత్యవతి, కల్పన, సులోచన, గ్రామస్థులు భూపతి శ్రీనివాస్‌భవాని దంపతులు, గ్రామ మాతృశక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మికులకు అండగా ఉంటాం : శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం మునిసిపల్ వైస్ చైర్మన్ రమేష్‌తో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎండి మహమూద్, శంభురెడ్డి, సహదేవ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	200	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 18.4



గుట్ట ఆలయంలో భక్తుల రద్దీ

సంక్రాంతి సంబురం



పతంగులతో చిన్నారుల సందడి

» ఊరూవాడ వేడుకలు » పండుగ ఖర్చు రూ.118.46కోట్లు » భారీగా వ్యయం చేసిన ఉమ్మడి జిల్లా వాసులు

» మద్యంపై రూ.40.17కోట్లు » ఆర్టీసీకి అదనంగా రూ.85లక్షల ఆదాయం » ఆరు రోజుల్లో నృసింహుడి ఆదాయం రూ.2.20కోట్లు

సంక్రాంతి పండుగంటే ఊరంతా సందడే ఉంటుంది. గ్రామాల్లో ఇంటికి చేరిన పంట ఉత్పత్తులతో రైతులు ఆనందంగా ఉండగా, కొలువుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కుమారులు, కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో ప్రతీ ఇంట సందడి వాతావరణం ఉంటుంది. పండుగకు ప్రత్యేక పూజలు, ఇంటిముంగిట గొబ్బెమ్మలతో రంగురంగుల రంగవళ్లులు, పిండి వంటలు, మాంసం రుచులు, పంతంగులతో చిన్నారుల సంబరాలు, సాయంత్రం వేళ మద్యం ప్రియుల సందడి ఉంటుంది. పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లా వాసులు భారీగా వ్యయం చేయగా, ప్రభుత్వ ఖజానాకు కాసులు కురిశాయి. మొత్తంగా రూ.118.46కోట్లను ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ పండుగకు ఖర్చుచేసినట్టు అంచనా.

(ఆంధ్రజ్యోతి,కోదాడ)

మద్యంపై భారీగా ఆదాయం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 299 వైన్స్ షాపులు ఉన్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 11, 13న నల్లగొండ, యాదాద్రి మద్యం డిపో పరిధిలో భారీగా విక్రయాలు జరిగాయి. రెండు రోజుల్లో రెండు డిపోల పరిధిలో 59,086 కాటన్ల బీర్లు, 42,137 కాటన్ల మద్యం మొత్తంగా 1,01,223 కాటన్ల విక్రయాలు జరిగాయి. కాగా, వీటి విక్రయాల ద్వారా రూ.40.17కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది. అంతేకాక ఈ నెల 14న, 15న వచ్చిన ఆదాయం దీనికి అదనం.



ఆర్టీసీకి రూ.8.05కోట్ల ఆదాయం



ప్రయాణికుల రద్దీ

ఉమ్మడి జిల్లా రీజియన్ పరిధిలో ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, దేవరకొండ, భువనగిరి, యాదగిరిగుట్టలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. సంక్రాంతి నేపథ్యంలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు ఆయా డిపోల పరిధిలో ఆర్టీసీ 415 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. ఈ బస్సులు 1,23,227కి.మీలు తిరిగి 1,22,500మంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చాయి. వారిలో మహాలక్ష్మి పథకం కింద 78,500మంది మహిళా ప్రయాణికులు ఉండగా, 44వేల మంది చార్జీలు చెల్లించి ప్రయాణించారు. ఏడు డిపోల పరిధిలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు మొత్తంగా 620 బస్సులు నడిచాయి. ఆయా బస్సులు 13.28లక్షల కి.మీలు తిరిగి, 13.55లక్షల మంది ప్రయాణికులను గమ్యానికి చేర్చాయి. మహాలక్ష్మి పథకం కింద 8లక్షల మంది మహిళలు ప్రయాణించగా, 5.55లక్షల మంది చార్జీలు చెల్లించి ప్రయాణించారు. ఆర్టీసీకి ఐదు రోజుల్లో మొత్తంగా రూ.8.05కోట్ల ఆదాయం రాగా, పండుగ సందర్భంగా రూ.85లక్షల అదపు ఆదాయం వచ్చింది. మొత్తంగా...

మిగతా 7వ పేజీలో...

పిండి వంటకాలపై రూ.1.44కోట్లు

సంక్రాంతి అంటే పిండి వంటలకు అందులో అరిసెలకు ప్రత్యేకత స్థానం ఉంటుంది. పిండి వంటలను ఇష్టపడనివారంటూ ఉండదు. ప్రస్తుతం పని ఒత్తిడితో పిండి వంటలకు అంతా స్వీట్స్ దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 144 స్వీట్స్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో అరిసెలపై రూ.1లక్ష, మొత్తంగా రూ.1.44 కోట్లు ఖర్చు చేశారు. బేకరి, ముగ్గుల కోసం ఉమ్మడి జిల్లా ప్రజలు సుమారు రూ.2కోట్ల మేర ఖర్చు చేసినట్లు సమాచారం.





యాదగిరిక్షేత్రం జన సంద్రం

భువనగిరి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వరుస ఉత్సవాలు, సంక్రాంతి పర్వదినానికి తోడు వరుస సెలవులు కలిసి రావడంతో ఆధ్యాత్మిక శోభతో క్షేత్రం జనసంద్రంగా మారింది. గత డిసెంబరు 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు, ఈ నెల 10 నుంచి 15 వరకు అధ్యయనోత్సవాలు కొనసాగగా, సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో వేకువజామున జరిగిన తిరుప్పావై ఉత్సవాల్లో మహిళలు, ఆరు రోజుల పాటు సాగిన అధ్యయనోత్సవాలు, స్వామివారి అలంకరణ తిరువీధి సేవలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 13న భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుమ మూడు రోజులు సంక్రాంతి సందర్భంగా భక్తుల రాక పెరిగింది. కొండపైన శివకేశవులు, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకాంప్లెక్స్, క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయ, ప్రాకార మండపాలు, తిరువీధులు, ప్రసాద విక్రయశాలలు, బస్టాండ్ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. కాగా, ఆరు రోజుల్లో రూ.2,20,47,604 ఆదాయం సమకూరింది. అధ్యయనోత్సవాలు....

మిగతా 7వ పేజీలో...

ఆరు రోజుల్లో గుట్ట ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు, ఆదాయం ఇలా..

తేదీ	భక్తుల సంఖ్య	నిత్య ఆదాయం
10	15,000	రూ.17,65,927
11	28,000	రూ.30,24,196
12	49,000	రూ.50,74,808
13	42,000	రూ.43,46,558
14	46,000	రూ.47,36,325
15	29,000	రూ.30,99,790
మొత్తం	2,09,000	రూ.2,20,47,604

పండుగపూట విషాదాలు

- రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి
- నల్లగొండ జిల్లాలో నలుగురు, యాదాద్రి జిల్లాలో ఇద్దరు మృతి

6లో

పథకాలను పకడ్బందీగా

అమలు చేయాలి



కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామసభల నిర్వహణ, అర్హుల జాబితా ఆమోదం తదితర కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పథకాల అమలుకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రైతు భరోసా'కు సంబంధించి భూభారతి పోర్టల్ నుంచి హార్డ్ కాపీలు అందుబాటులో ఉన్నాయని, మండల వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని ఈనెల 16 నుంచి 20 వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను కేటగిరీ వారిగా నమోదు చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహించి వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు చదివి వినిపించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఈనెల 25న జిల్లా ఇన్‌చార్జి మంత్రితో అర్హుల జాబితా ఆమోదం తీసుకుని, ఈనెల 26 నుంచి పథకాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కింద 2023-24లో ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 రోజులు పని చేసిన వారి జాబితా రాష్ట్రస్థాయి నుంచి గ్రామసభల నిర్వహణలోపు వస్తుందని, ఆ జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించి ఏమైనా అభ్యంతరాలుంటే 10 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

నూతన రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను గ్రామసభల్లో చదివి వినిపించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఈనెల 26న కనీసం 10శాతం నూతన రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సర్వేలో అర్హత పొందిన వారి ఆన్‌లైన్ డేటాను రెండు రోజుల్లో సూపర్ చెక్ పూర్తి చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో ప్రాధాన్య క్రమంలో లబ్ధిదారుల జాబితాను ఆమోదించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ శ్రావణ్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తేలనున్న భూముల లెక్కలు

- నేటి నుంచి 20వ తేదీ వరకు క్షేత్ర స్థాయి పరిశీలన
- వ్యవసాయ యోగ్యం కాని భూములను తేల్చే పనిలో యంత్రాంగం

సాగు భూముల లెక్కలను తేల్చేందుకు వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ గ్రామాలు, క్లస్టర్ల వారీగా ప్రతి సర్వే నెంబర్‌ను చూడటంతో పాటు వ్యవసాయ యోగ్యం కాని భూముల లెక్క తేల్చనున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

రైతుభరోసాకు సంబంధించి భూ భారతి పోర్టల్ నుంచి పట్టదారు పాస్‌పుస్తకాలు ఉన్న రైతుల వివరాల హార్డ్ కాపీలు మండల వ్యవసాయ అధికారులకు ప్రభుత్వం అందజేసింది. దీంతో మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ బుధవారం ఈ డేటాను డౌన్‌లోడ్ చేసుకొని ఐదు రోజుల పాటు గ్రామాల్లో సర్వే చేపట్టనున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వ్యవసాయ విస్తరణాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, లేదంటే ఒక రెవెన్యూ అధికారి పాల్గొంటారు. వారు గ్రామాల్లో పర్యటించి వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు నమోదుచేస్తారు. సాగులో ఉన్న భూమి కోసం ప్రభుత్వం ఏటా రూ.12వేలను పెట్టుబడి సాయంగా అందజేయనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.7500 చొప్పున మొత్తం రూ.15వేలు జమ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నేపథ్యంలో ప్రభుత్వం రూ.12వేలు అందజేయనుంది. ఉమ్మడి జిల్లాలో 21.50లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

సాగుకు యోగ్యం కాకుంటే

'భరోసా' లేనట్లే..

రాళ్లు, రప్పలు, గుట్టలు, ఇండ్లు, ప్లాట్లతో పాటు సాగుకు అనుకూలంగా లేని భూములకు ప్రభుత్వం రైతు భరోసాను నిలిపివేయనుంది. కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించనుంది. గత ప్రభుత్వం హయాంలో ఎకరాకు రూ.5వేలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.6వేలు అంటే రెండు సీజన్లకు కలిపి రూ.12వేలను పెట్టుబడి సాయంగా ఇవ్వనుంది. సాగుకు యోగ్యంగా లేని భూముల వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అధికారులు నమోదు చేసి 25వ తేదీ నాటికి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తారు. 16 నుంచి 20వ తేదీ వరకు సర్వే చేసిన అనంతరం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామపంచాయతీల వారీగా గ్రామ సభలు నిర్వహిస్తారు. ఆయా గ్రామ సభలో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలుచదివి వినిపించి ఆమోదం తీసుకుంటారు. నల్లగొండ జిల్లాలో 566 రెవెన్యూ గ్రామాలు, సూర్యాపేట జిల్లాలో 279, యాదాద్రి జిల్లాలో 321 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి ఐదు రోజుల్లో ప్రతీ సర్వేనెంబర్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. వ్యవసాయ యోగ్యం కాని భూములను తేల్చే పనిలో యంత్రాంగం

మిగతా 7వ పేజీలో...

అంకితభావంతో పనిచేయాలి



ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, పదోన్నతి పొందిన వారు అంకితభావంతో పని చేసి శాఖ గౌరవాన్ని, విశ్వాసాన్ని పెంచేలా పని చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం పరిధిలో పని చేస్తున్న 11 మంది ఏఎస్‌ఐలు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన నేపథ్యంలో బుధవారి వారికి తన క్యాంపు కార్యాలయంలో స్టార్‌లను అందజేసి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలతో మమేకమవుతూ బాధ్యతతో పని చేస్తూ మన్ననలు పొందాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని న్యాయం చేయాలన్నారు. బాధితులకు న్యాయం చేసినప్పుడే పోలీస్‌శాఖకు గౌరవం వస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజు, పదోన్నతి పొందిన ఎస్‌ఐలు భిక్షమయ్య, అవుట జయరాజు, ఐ.శ్రీనువాసులు, ఎండీ.గౌస్, ఎండీ.అహ్మద్‌షరీఫ్, ఎం.దుర్గారెడ్డి, డి.నర్సిరెడ్డి, ఎస్.కృష్ణ, జి.కృష్ణారెడ్డి, మహబూబ్‌అలీ, జహంగీర్ పాల్గొన్నారు.

వైటీపీఎస్ జాబ్‌కార్డుదారులకు

నేడు చివరి గడువు

» ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి » సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్



విలేకరులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ జాబ్‌కార్డులు పొందిన నిర్వాసితులు ఈ నెల 16 సాయంత్రంలోగా సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని సబ్‌కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైటీపీఎస్‌లో ఇళ్లు కోల్పోయిన 133 కుటుంబాల్లో అర్హులైన 116 మంది జాబితాను టీఎస్ జెన్కోకు బోర్డుకు పంపామన్నారు. మరో 16 కుటుంబాల్లో వారసులు లేనందున మనుమలు, బంధువుల పేరున ఉద్యోగం ఇచ్చేందుకు కమిటీకి నివేదించామన్నారు. మరొకరు ఉద్యోగానికి బదులు నగదు తీసుకునేందుకు ఒప్పుకున్నారని తెలిపారు. 525 నిర్వాసిత కుటుంబాల జాబితాను రూపొందించేందుకు గత మూడు వారాలు సర్వే నిర్వహించామని తెలిపారు. వారిలో 400 కుటుంబాలు స్పందించగా, మరో 125 కుటుంబాల నుంచి స్పందన కరువైందన్నారు. 400 కుటుంబాల్లో 220 మంది వరకు అవార్డు డ్యాకుమెంట్లతో వచ్చి వివరాలు అందజేశారని, 80 కుటుంబాల వారికి వారసులు లేనందున అల్లుడు, మనుమలు తదితరుల పేర్లు ఇచ్చారన్నారు. వీరి జాబితాను ప్రత్యేక బోర్డుకు పంపుతామన్నారు. మిగతా వారు ఈ నెల 16 సాయంత్రంలోగా వివరాలు అందజేయాలన్నారు. అర్హుల జాబితాను రూపొందించి జెన్కో బోర్డుకు పంపుతామన్నారు. ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నట్టు తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఇళ్లకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లి పరిశీలన నిర్వహిస్తారని చెప్పారు. 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కేటగిరీల వారిగా గ్రామసభల ద్వారా జాబితా రూపొందించనున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో తొలుత భూమిలేని నిరుపేద ఉపాధిహామీ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలు అందజేయనున్నట్టు తెలిపారు. 2023-24 సంవత్సరంలో జాబ్‌కార్డులు ఉన్న వారు కనీసం 20రోజుల పాటు పనిదినాలు నమోదై ఉండాలని చెప్పారు. గ్రామసభల్లో వీరిని గుర్తిస్తామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఈ నెల 25 నుంచి 28 తేదీ వరకు సంగారెడ్డిలో జరగనున్న పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్లను స్థానిక పార్టీ కార్యలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ నెల 25న సంగారెడ్డి పట్టణంలో ప్రజా ప్రదర్శన, పీఎస్ఆర్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజ సమస్యలపై వారి పక్షాన నిలబడి పోరాడుతున్నది సీపీఎం ఒక్కటేనన్నారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం గడిచినా నేటికీ ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలోని ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. నిరుద్యోగ యువత కొలువుల కోసం ఎదురు చూస్తున్నారని, కూలీలు, కార్మికుల బతుకులు దయనీయంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పాలనకు విసిగిన ప్రజలు ఆశతో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాదిగా వాగ్దానాలు తప్ప అమలుకు నోచుకోలేదన్నారు. సీపీఎం పోరాటాల ఫలితంగానే డిండి ఎత్తిపోతల పనులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో క్రమంగా అసంతృప్తి పెరుగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటి, రెండు తప్ప మిగతావి అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, వి.వెంకటేశ్వర్లు, గంజి మురళి, దండెంపల్లి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి సందడి



చింతపల్లి: బట్టుగూడెంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో సంక్రాంతి పండగ వేడుకలను ప్రజలు మంగళవారం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ దేవరకొండ మండలం ఇద్దంపల్లి ఈదమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, వెంకటయ్యగౌడ్, శ్రీధర్‌రెడ్డి, సర్వయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి, (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. వింజమూర్ గ్రామపంచాయతీలోని బట్టుగూడెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ. సిరాజ్‌ఖాన్, మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, అంగిరేకుల నాగభూషణ్, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, సదానందం, రాజు, రాజేష్, పాల్గొన్నారు. సంక్రాంతి పండుగను మండలంలో ఘనంగా నిర్వహించారు. చింతపల్లి, గొడుకొండ్ల, వెంకటేశ్వరనగర్, కుర్మపల్లి గ్రామాల్లో మహిళలు, యువతులు ఇంటి ముందు వివిధ రకాల రంగులతో ముగ్గులు వేశారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు.

హాలియా, (ఆంధ్రజ్యోతి): హాలియాలోని సాయిప్రతాప్‌నగర్‌లోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదారంగనాథస్వామి కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు శ్రీరామాచార్య పర్యవేక్షణలో విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధన మాంగల్య పూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు గోవర్ధన రాఘవాచార్యులు, ఈత వెంకటేశ్వరరాజు పద్మజ, కంచర్ల గురువారెడ్డి, చంద్రకళ, మనాది రవీందర్, శ్రీలత దంపతులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ఇళ్లముందు రంగురంగుల ముగ్గులు వేసి, ఆవుపేడతో గొబ్బెమ్మలు, నవధాన్యాలు, రేగుపళ్ళు, పూలు ఉంచి పూజలు నిర్వహించారు.

పెద్దఅడిశర్లపల్లి, (ఆంధ్రజ్యోతి): అంగడిపేట గ్రామపంచాయతీ ఆవరణలో చిన్నారులకు కైట్ ఫెస్టివల్ పోటీలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటీ సతీష్‌రెడ్డి, తదితరులు హాజరై ప్రతిభ కనబర్చిన చిన్నారులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వంగాల అమరేందర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్, వంగాల సుచరితవెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుశలయ్య, భూపాల్‌రెడ్డి, అక్బర్, విష్ణుమేస్త్రీ, గణేష్, నీలం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంపసాగర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ నాయకుడు కొండా భాస్కర్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అవిరేండ్ల మట్టయ్య, అలంపల్లి జానయ్య రాంచంద్రయ్య, అనుముల అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



పీఏపల్లిలో గాలిపటాలతో చిన్నారులు



త్రిపురారం మండలం కంపసాగర్‌లో ముగ్గులు పరిశీలిస్తున్న నాయకులు



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న యువతి, ముగ్గు వేస్తున్న చిన్నారి

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అమ్మానాన్న ఫౌండేషన్ ప్రతినిధులు

నిడమనూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అమ్మానాన్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జిల్లా మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. మండలం బంకాపురం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల చదువుల కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ పేలపూడి బాలకృష్ణ మాట్లాడుతూ బంకాపురం గ్రామంలో నిరు పేదలకు వైద్య ఖర్చులు, వివిధ సామాజిక కార్యక్రమాల ద్వారా రూ.5,13,906లు పేద ప్రజల కోసం ఖర్చు చేశామన్నారు. పేద విద్యార్థుల చదువు కోసం 129మంది దాతల నుంచి రూ.3,54,594లు సేకరించి, తల్లి తండ్రులను కోల్పోయిన 20కుటుంబాల్లోని విద్యార్థుల చదువు కోసం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉన్నం చినవెంకటేశ్వర్లు, వీరమళ్ల శ్రీనివాస్, పాంపాటి యా దగిరి, కుక్కడపు రమేష్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, మురళీధర్ రావు, సెక్రటరీ గుండం రాజు వెంకటేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, గుండా లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ లీకై మంటలు



కాలిపోయిన వస్తువులు

కొండమల్లేపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో సిలిండర్ లీకై మంటలు అంటుకున్నాయి. ఈ సంఘటన కొండమల్లేపల్లి మండలంలోని గుర్రపుతండాలో పరిధిలోని పన్నితండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన రమావత్ రాజు ఇంట్లో కుటుంబ సభ్యులు వంట చేసే క్రమంలో గ్యాస్ పొయ్యిని వెలిగించే క్రమంలో సిలిండర్ లీకై మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల విలువైన వస్తువులు, రూ.34వేల నగదు కాలిపోయినట్లు బాధితుడు రాజు తెలిపాడు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

దేవరకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దేవరకొండ పట్టణంలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించాలని కోరారు. పట్టణంలో కూరగాయల మార్కెట్‌లేక రైతులు, ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చింతపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వర నగర్‌కు చెందిన పోల రామేశ్వరమ్మ ఇటీవల్ల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ రామేశ్వరమ్మ కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బాదేపల్లి పులిరాజ్‌గౌడ్, గడ్డం శేఖర్‌గౌడ్, గ్యార పోషయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులు అధైర్య పడవద్దు

మర్రిగూడ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాల భూనిర్వాసితులు అధైరపడవద్దు, ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీనివాస్‌నా యక్ అన్నారు. మర్రిగూడలో బుధవారం నిర్వహించిన సమావే శంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే తొమ్మి దేళ్లుగా ముంపు గ్రామాల బాధితులు పునరావాస స్థలం కేటాయించడంలో లబ్ధిపొందలేక పోయినట్లు తెలిపారు. వీరికి మొదటగా రిజర్వాయర్‌కు అతిసమీపంలో ఉన్న నర్సిరెడ్డిగూడెం గ్రామ బాధితులైన 289 మందికి సాయిబాబా దేవాలయం వెనక భాగంలో ఇంటిస్థలం కేటాయించి పట్టా ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు.

నేడు చెర్వుగట్టుపై జాతర సమన్వయ సమావేశం

నార్కట్‌పల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల మొదటి వారంలో జరగనున్న చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిమిత్తం ఈ నెల 16న సమన్వయం సమావేశం ఏర్పాటు చేసినట్లు దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొంటారని తెలిపారు.

‘ఆదర్శ గ్రామాల ఏర్పాటుకు మన ఊరు- మన ఎమ్మెల్యే’



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలనూ ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మన ఊరు- మన ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆమనగల్లు గ్రామంలో గల పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో రెంటాల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించి అనంతరం డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి మన ఊరు- మన ఎమ్మెల్యే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు, జిల్లా మంత్రుల సహకారంతో తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 13నెలల్లో పాలపరమైన అంశాలు, అధికారుల తీరు, కార్యకర్తల వ్యవహార శైలిపైనే దృష్టి సారించానని, ఇకపై ప్రతిరోజూ నియోజకవర్గంలో పర్యటిస్తానన్నారు. ప్రతి గ్రామంలోనూ సీనియర్ నాయకులను కలుపుకొని గ్రామానికి 20మంది కార్యకర్తలతో కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి వారికి అందేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావు ఇవ్వకూడదన్నారు. కాంగ్రెస్ జెండా మోసి పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న వారిని గ్రామ కమిటీల నిర్ణయం మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామంలో 15మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, రాష్ట్ర నాయకుడు స్కైలాబ్‌నాయక్, మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, పిల్లల సందీప్, వల్లంపట్ల ప్రవీణ్, పుట్టల శ్రీను, పల్లా వీరయ్య, పేరెల్లి నగేష్, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాగవెల్లి మధు, బెజ్జం సాయి, దేశిరెడ్డి పాల్గొన్నారు.

పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయాలి

కట్టంగూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ వంటి పథకాలకు అధికారులు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికపై అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 21 నుంచి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అందులో అర్హులైన ముసాయిదా వివరాలను ప్రకటించనున్న ట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీవో చింతమ ల్ల చలపతి, ఏవో గిరిప్రసాద్, ఏపీవో కడెం రాంమోహన్, పంచాయ తీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా సర్వేకు అధికారులు సిద్ధం కావాలి : ఆర్డీవో



డిండిలో జరిగిన సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

డిండి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రైతు భరోసాపై సర్వే నిర్వహించేందుకు అధికారులు సన్నధం కావాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. బుధవారం డిండి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 16వ తేది నుంచి 20వరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించాలని కోరారు. సాగుకు యోగ్యమైన భూములను గుర్తించాలని సూచించారు. 2023-24లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీలో కనీసం భార్య, భర్తలలో 20 రోజుల పనిదినాలు కలిగి ఎలాంటి భూమిలేని నిరుపేదలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించేందుకు ఎంపిక చేయాలని కోరారు. మండలంలో 14,460 మంది ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ అంబటి అంజనేయులు, ఎంపీడీవో వెంకన్న, ఏవో రెహనా, సీనియర్ అసిస్టెంట్ ముస్తఫా, ఆర్ఐ శ్యాంనాయక్, నర్సింహ, పంచాయతీ కార్యదర్శులు జంగయ్య, ఏఈవోలు సాయితేజ, విజయ, పరమేశ్వరి, జ్యోతిలక్ష్మీ, దావలయ్య, జయశ్రీను, నరేందర్, వెంకటయ్య, పంచయతీ కార్యదర్శులు, జాతీయ ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వేములపల్లి,(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందుతుందని మండల వ్యవసాయాధికారి రమావత్ కిశోర్‌నాయక్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక వద్ద మండల ఏఈవోలతో రైతు భరోసా సర్వేపై సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలోని సర్వే నెంబర్ వారీగా సర్వే చేసేందుకు మండలంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే నిర్వహిస్తామన్నారు. 16న ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం, మొల్క పట్నం, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో, 17న చలిచీమలపాలెం, సల్కు నూరు, మంగాపురం, బుగ్గబావిగూడెం, 18న రావులపెంట, శెట్టిపాలెం, అన్నపరెడ్డిగూడెం, 19న కామేపల్లి, ఇటిక్యాల, ముండ్లపహాడ్, వేములపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు నితిన్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్), (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేయనున్న పలు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల కోసం చేపట్టనున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి శారద అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సర్వే కోసం మండలంలో ఆరు టీంలను ఏర్పాటు చేసినట్లు, ఈ సర్వే బృందాలు వివిధ పథకాలకు అర్హులను గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో మల్లేశ్వర్, ఏవో హర్షిత, ఎంపీవో భిక్షంరాజు, ఆర్ఐ లక్ష్మీకాంత్, ఎంఈవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమస్యల పరిష్కారానికి కృషి

● ఎంపీడీవో బాలరాజరెడ్డి



మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో బాలరాజరెడ్డి తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, కృష్ణాజలాల సరఫరా, ట్రాఫిక్ సమస్యలపై బుధవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు.

● కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: కొండమల్లేపల్లిలో రోడ్డుకు ఇరువైపులా చిరు దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు.

ఎంపీడీవో: రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన చిరు దుకాణాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. పోలీసు అధికారులు, గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి అందరి సూచనల మేరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పారిశుధ్యంపై గ్రామపంచాయతీ సిబ్బంది ప్రధాన రహదారుల్లో మాత్రం శుభ్రం చేస్తున్నారని, కాలనీల్లో శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు?

ఎంపీడీవో : రోడ్లను, డ్రైనేజీ శుభ్రం చేయడం, అన్ని కాలనీల్లో రోడ్లపై చెత్త లేకుండా శుభ్రం చేయాలని పారిశుధ్య కార్మికులకు చెప్పాం. పారిశుధ్య కార్మికులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: కొన్ని గ్రామల్లో కృష్ణా జలాలు సక్రమంగా సరఫరా కావడం లేదని, కొన్ని గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీతో కలుషిత నీరు సరఫరా అవుతుందని ప్రజలు అంటున్నారు.

ఎంపీడీవో: దాదాపు అన్ని గ్రామాల్లో కృష్ణా జలాలు సరఫరా అవుతున్నాయి. కృష్ణాజలాలు సరఫరా కాని పక్షంలో గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారు. కృష్ణా జలాల పైప్‌లైన్‌ల లీకేజీతో కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు మా దృష్టికి రాలేదు. లీకేజీతో కలుషిత నీరు వస్తే మైనర్ లీకేజీలపై గ్రామ కార్యదర్శులు పరిష్కరిస్తారు. భారీ ఎత్తున లీకేజిలు ఉంటే మిషన్ భగీరథ ఏఈ (ఆర్ డబ్ల్యూఎస్) దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

‘నెల్లికంటి పార్వతమ్మ మృతి బాధాకరం’

మునుగోడురూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ మృతి బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఎలుగులగూడెం గ్రామంలో నెల్లికంటి పార్వతమ్మ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. నాయకులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు భవనం మధుసూదన్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, గన్న చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జయిని యాదగిరిరావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, పల్లా దేవేందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, తదితరులు నివాళులర్పించారు.

రోడ్డుపైనే విక్రయాలు.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు

● స్థలం లేక రోడ్డు పక్కన నిలబడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు



గుర్రంపోడు మండలకేంద్రంలో రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు

గుర్రంపోడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండల కేంద్రంలో రోడ్డుపైనే విక్రయాలు నిర్వహిస్తుండడంతో ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలకేంద్రంలో బస్‌షెల్టర్ కూడా లేకపోవడంతో నల్లగొండ-దేవరకొండ వెళ్లే ప్రయాణికులు రోడ్ల పక్కనే నిలవాల్సి వస్తోంది. దుకాణాల ఎదుట రోడ్డు పొడవునా చిరువ్యాపారులతో పాటు కొంతమంది దుకాణాల యజమానులు పాన్‌షాపులు, ఇతర చిరు వ్యాపారాలకు అద్దె తీసుకొని రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మొత్తం రోడ్డుకు ఇరువైపులా ఈ వ్యాపారాలు నడుస్తుండడంతో ప్రయాణికులు ఎక్కడ నిలబడాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోవాల్సిందే. 1990వ సంవత్సరంలో ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ అయి సుమారు ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. 1994లో ఓ పోలీస్ అధికారి వాహనం బ్రేకులు ఫెయిల్ అయి ఇద్దరు మృతి చెందారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ వ్యాపారాలపై దృష్టిసారించడం లేదు. పది సంవత్సరాల క్రితం పోలీస్ అధికారులు రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పి నిరుపయోగంగా ఉన్న ఆర్అండ్‌బీ అతిథి గృహంలో చిరువ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించినప్పటికీ వారం, పది రోజుల్లోనే ప్రజాప్రతినిధుల చొరవతో మళ్లీ చిరువ్యాపారులు రోడ్డెక్కారు. దీంతో రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

రోడ్డుకు కూడా అద్దె

గుర్రంపోడులో రోడ్డుకు కూడా కొంత మంది అద్దె వసూలు చేసుకుంటున్నారు. రోడ్డుకు ఒకటి, రెండు ఫీట్ల దూరంలోనే పాన్‌షాపులు, ఇతర చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కొంతమంది ఆర్అండ్‌బీ ఎదుట ఆక్రమించుకున్న స్థలంలో నిర్మాణాలు చేపట్టి అద్దె వసూలు చేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు ఏనాడూ వారి వద్దకు వెళ్లి అడిగిన దాఖలాలు లేవు. ఇబ్బందులు లేకుండా చూస్తే ప్రయాణికులు బస్సుల కోసం నిలుచునేందుకు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.